

పండుగకూ.. పప్పు లేదాయె..

జనవరిలోనూ కార్డుదారులకు అందని కందిపప్పు

సంక్రాంతి పూట పంపిణీ చేయకపోవడంపై జనం ఆగ్రహం

బియ్యం, పంచదారతో సరిపెడుతున్న వైనం

ధరల మంటతో లబోదిబోమంటున్న ప్రజలు

తమది పేదల ప్రభుత్వమనీ, ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా నిత్యావసర సరుకులు ప్రజలకు అందిస్తామని ముఖ్యమంత్రి జగన్‌తోపాటు ప్రజాప్రతినిధులు సభలు, సమావేశాల్లో గొప్పలు చెప్పుకుంటున్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా అందించే నిత్యావసర వస్తువులు ఒక్కొక్కటి తగ్గిపోతున్నాయి. కందిపప్పు దాదాపు కనుమరుగవుతున్న పరిస్థితి నెలకొంది. ప్రధాన పండుగల్లో ఒకటైన సంక్రాంతికి టీడీపీ హయాంలో చంద్రన్న సంక్రాంతి కానుక కింద తొమ్మిది రకాల నిత్యావసర సరుకులను పంపిణీ చేసేవారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక ప్రజాపంపిణీ వ్యవస్థలో అందించే నిత్యావసర సరుకులు ఒక్కొక్కటి ప్రజల దరి చేరకుండా పోతున్నాయి. దీంతో ప్రజలు బహిరంగ మార్కెట్‌లో అధిక డబ్బు వెచ్చించి, కొనాల్సిన పరిస్థితి ఏర్పడింది. కూరగాయల ధరలు కూడా ఆకాశాన్ని అంటుతున్నాయి. దీంతో పేద, మధ్యతరగతి ప్రజలపై అదనపు భారం పడుతోంది.

ధర్మవరం



అంతా తారుమారు..

రాష్ట్ర విభజనకు ముందు రేషన్ దుకాణాల్లో తొమ్మిది సరుకులు అందించేవారు. అనంతరం అధికారంలోకి వచ్చిన టీడీపీ బియ్యం, వంటనూనె, గోధుమలు, కందిపప్పు, పంచదార, ఎండు మిర్చి, ఉప్పు, కారం, బెల్లంతోపాటు టీ పొడి, అగ్గిపెట్టెలను కూడా అందజేసింది. వైసీపీ అధికారం చేపట్టాక పరిస్థితి తారుమారైంది. ప్రస్తుతం చౌకధరల దుకాణాల ద్వారా బియ్యం, పంచదార మాత్రమే ఇస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో వంటనూనె రూ.150, కందిపప్పు ధర రూ.180, వెల్లుల్లి రూ.300 ధర పలుకుతున్నాయి నిత్యావసర సరుకుల ధరలన్నీ పెరిగిపోవడం పేద, మధ్య తరగతి వారిపై పెనుభారంగా మారింది. సంపాదనలో చాలావరకు నిత్యావసరాలకే వెచ్చించాల్సి వస్తోందనీ, మిగతా అవసరాల సంగతేంటని ఆ వర్గాలు వాపోతున్నాయి. జిల్లాలో 5.69 లక్షల రేషన్‌కార్డులున్నాయి. ప్రతినెలా 540 మెట్రిక్ టన్నులు కేటాయించాల్సి ఉంది. ప్రభుత్వం నిర్దేశిత ధర రూ.67 ప్రకారం నెలకు కోట్లాది రూపాయల విలువైన కందిపప్పు.. లబ్ధిదారులకు అందించాల్సి ఉంది. ఐదు నెలలుగా సరఫరా పూర్తిగా ఆపేశారు.

• అప్పుడు కానుకతో పండుగ

తెలుగువారికి సంక్రాంతి ప్రధాన పండుగ. పండుగను ప్రజలంతా సంతోషంగా చేసుకోవాలని టీడీపీ హయాంలో చంద్రన్న సంక్రాంతి కానుకను ప్రవేశ పెట్టారు. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పలు సరుకులను ఉచితంగా పంపిణీ చేశారు. పండుగ పూట పేద, మధ్యతరగతి ప్రజలకు ఇది ఎంతో ఊరటనిచ్చేది. వైసీపీ అధికారంలోకి వచ్చాక సంక్రాంతి కానుక పంపిణీకి తిలోదకాలిచ్చింది. ఇంటింటికీ రేషన్ పంపిణీ అంటూ హడావుడి చేసింది. సరుకుల సంఖ్యను క్రమంగా తగ్గిస్తూ వచ్చింది. ఐదు నెలలుగా కందిపప్పు కూడా ఇవ్వట్లేదు. సంక్రాంతి పండుగ ఉన్న జనవరిలో కూడా కందిపప్పు ఇవ్వకపోవడంతో కార్డుదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

• ఇంటింటా రేషన్ పంపిణీ ఏదీ?

ప్రజల వద్దకే పరిపాలన, ఇంటింటికీ రేషన్ సరుకులు అందిస్తామంటూ ప్రభుత్వం ఎండీయూ వాహనాలను తీసుకొచ్చింది. వాటి నిర్వహణ బాధ్యతలను అధికార పార్టీ కార్యకర్తలకు అప్పజెప్పింది. వాటి ద్వారా ఉపాధి పొందవచ్చని కార్యకర్తలు ఆనందపడ్డారు. వాటిని పొందిన ఆ పార్టీ కార్యకర్తలు కొన్నాళ్లకే ఎండీయూ వాహనాలు వద్దు బాబోయ్ అంటూ అధికారులకు తిరిగి అప్పగిస్తున్నారు. దీంతో అధికారులకు వాటి నిర్వహణ తలనొప్పిగా మారింది. వారు కూడా ఏమీ చేయలేకపోతుండడంతో ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటా సరుకుల పంపిణీ దాదాపుగా నిలిచిపోయిందనే చెప్పొచ్చు. దీంతో ప్రజలు రేషన్ దుకాణాల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోంది.



ఈనెల కోటా కందిపప్పు ఇస్తున్నాం

జిల్లాలో ఈనెలలో వంద శాతం కందిపప్పు ఇస్తున్నాం. ఇప్పటికే కందిపప్పు కొన్ని స్టాక్‌పాయింట్లకు సరఫరా చేశాం. మిగిలిన స్టాక్‌పాయింట్లకు పంపుతాం.

- వంశీకృష్ణారెడ్డి, డీఎస్ఓ



కాసులిస్తేనే కేసుల్లో కదలిక!

అక్రమాలకు అడ్డా ఆ సర్కిల్..

లంచావతారమెత్తిన ఎస్ఐ, సీఐపై ఏసీబీ కేసు

అందలం ఎక్కించిన వారే.. చిట్టా బయటపెట్టారు..

నేరస్థులను కట్టడి చేయాల్సిన పోలీసు శాఖలో కొందరు కట్టుతప్పుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అవినీతికి దారులు తెరిచి అడ్డంగా దొరికి పోలీసు శాఖకు మచ్చతెచ్చిపెడుతున్నారు. అక్రమార్జన కోసం నేరస్థులతో కుమ్మక్కై, అధికార పార్టీ నేతలతో ములాఖత్ అవుతున్నారు. ఈనేపథ్యంలో జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లు అవినీతికి అడ్డాలుగా మారిపోయాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఠాణాలపై ఉన్నతాధికారుల నిఘా కొరవడడంతో వారు ఆడిందే ఆటగా తయారైంది. కాసులు సమర్పించుకోనిదే కేసులు కదలని పరిస్థితి. కేసుల పేరుతో అమాయకులను బెదిరిస్తూ అందినకాడికి దండుకుంటున్నారన్న విమర్శలున్నాయి. తాజాగా రామగిరి సర్కిల్‌లో ఇద్దరు అవినీతి అధికారుల వ్యవహారమే ఇందుకు తార్కాణం. కులాంతర ప్రేమ వివాహ వివాదంలో కేసు మాఫీకి పెద్ద మొత్తంలో లంచం డిమాండ్ చేయడంతో చేన్నేకొత్తపల్లి పోలీసు స్టేషన్‌పై అవినీతి నిరోధక శాఖ దాడుల్లో కనగానపల్లి ఎస్ఐ దొరికిపోగా.. రామగిరి సీఐ పరారైన సంగతి తెలిసిందే. ఇలాంటి రాజాలు జిల్లాలో చాలా స్టేషన్లలో హవా సాగిస్తున్నారు. ఏసీబీ దాడులతో అవినీతి ఖాకీల్లో వణుకు పుట్టింది.

(ఆంధ్రజ్యోతి, పుట్టపర్తి)



అధికార పార్టీ నేతల కళ్లల్లో ఆనందం కోసం..

బాధితుల పక్షాన నిలవాల్సిన కొందరు పోలీసులు అధికార పార్టీ నేతలకు వత్తాసు పలుకుతున్నారు. వారు చెప్పినట్లు నడుచుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పోస్టింగుల్లో అధికార పార్టీ నేతల పాత్ర కీలకం కావడంతో వారు చెప్పినట్లు తలాడిస్తున్నారు. నాయకుల సిఫార్సు లేఖలు ఇవ్వనిదే పోస్టింగ్ ఇచ్చే పరిస్థితి లేదు. తమకు నచ్చిన చోటుకు వెళ్లేందుకు నేతలను ప్రసన్నం చేసుకునే క్రమంలో ఇటీవలి ఖాకీలు పడరానిపాట్లు పడుతున్నారు. ఈనేపథ్యంలో నాయకుల ఆదేశాలు వారికి శిరోధార్యం అవుతున్నాయి. గిట్టని వారిని కట్టడి చేసేందుకు నేతలు తమ కనుసన్నల్లో పనిచేసే పోలీసులను వినియోగిస్తున్నారు. రాప్తాడు నియోజకవర్గంలో ఓ ప్రజాప్రతినిధి సిఫార్సులతో పోస్టింగ్ తెచ్చుకున్న ఓ సీఐని ఇక్కడి నుంచి మార్చాలని పోలీసు ఉన్నతాధికారులు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితంలేదు. మార్చడానికి వీలులేదని ఆ ప్రజాప్రతినిధి పట్టుబట్టడమే ఇందుకు కారణం. అధికారం అండతో చెలరేగిన సీఐ చివరకు ఏసీబీ వలలో చిక్కుకున్నారు. జిల్లాలో అత్యంత సమస్యాత్మక ప్రాంతం రామగిరి సర్కిల్‌లో మూడేళ్లకుపైగా అధికార పార్టీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి ఆశీస్సులతో ఓ పోలీసు అధికారి తిష్టవేసి, అధికార పార్టీ కళ్లలో ఆనందం కోసం తగ్గేదేలే అన్న విధంగా వ్యవహరిస్తున్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ అధికార పార్టీకి, ఆర్థిక బలమున్న వారికే అన్న భావన ప్రజల్లో నెలకొంది. ప్రభుత్వం, అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, నేతలను ప్రశ్నించినా, విమర్శలు చేసినా ఖాకీని అడ్డం పెట్టుకుని అదుపులోకి తీసుకుని దాడులు, అక్రమ కేసులు బనాయించడం, ఆర్థిక మూలాలను దెబ్బతీయడం, బెదిరించడం వంటివి కొనసాగుతూనే ఉన్నాయి. భూవివాదాల్లోకి అధికార పార్టీ నేతలు తలదూర్చి పంచాయితీలతో సామాన్య ప్రజలను బెదిరిస్తున్న ఘటనలు కోకొల్లలు. ఇలా అధికార పార్టీకి ఖాకీ వత్తాసు పలుకుతుండడంతో సామాన్యులు కూడా పలు పోలీసు స్టేషన్లకు వెళ్లాలంటే జంకే పరిస్థితి నెలకొంది.

అక్రమార్జనకు అడ్డా..



రామగిరి సర్కిల్‌లో ఖాకీల దందాలకు హద్దే లేకుండా పోయిందని ఏకంగా డీజీపీకే అక్రమాల చిట్టాతో వివరంగా ఇచ్చారు. వైసీపీ అధికారంలో వచ్చాక మూడేళ్లుగా ఖాకీ రామగిరి సర్కిల్‌లో మద్య వర్తుల సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేసుకుని దందాలకు పాల్పడుతూ కోట్లు దండుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. సర్కిల్‌లో కర్ణాటక సరిహద్దుతోపాటు జాతీయ రహదారి వెళ్తుండడంతో అక్రమ రవాణాకు అడ్డాగా మారింది. కర్ణాటక నుంచి డీజిల్ అక్రమ రవాణా చేసుకుంటున్న ముఠాల నుంచి నెలవారీ మామూళ్లు దండుకుంటున్నారన్న ఆరోపణలు మూటగట్టుకుంటున్నారు. ఉమ్మడి జిల్లా నుంచి రేషన్ బియ్యాన్ని కర్ణాటకకు తరలించే, కర్ణాటక నుంచి జిల్లాలోకి మద్యం తీసుకొచ్చే ముఠాలకు సైతం వత్తాసు పలుకుతున్నట్లు పోలీసు శాఖలో చర్చ సాగుతోంది. పెన్నానది నుంచి ఇసుక తవ్వకాల్లో నెలవారీ మామూళ్ల వచ్చిపడుతున్నట్లు విమర్శలున్నాయి. జాతీయ రహదారిపై పశువులు, గొర్రెలు, పందులు రవాణా చేయాలంటే ఈ దారిలోనే సరిహద్దు దాటాల్సివస్తోంది. రోడ్డు ప్రమాదాల్లో శవాలపై కాసుల వేట సాగిస్తున్నారు. రియల్ వ్యాపారులు, వెంచర్లు, భూసెటిల్మెంట్లతో ముక్కుపిండి వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి. చివరకు పీర్ల పండుగ చేసుకోవాలన్నా కప్పంకట్టాల్సిందే అన్న చర్చ సాగుతోంది. స్టేషన్ల మెట్లు ఎక్కితే రాజీ అయినా కప్పం కట్టాలన్న ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ఇలా సర్కిల్‌స్థాయి అధికారి రూ.10 కోట్లకుపైగానే వెనకేసుకున్నట్లు అక్రమాల చిట్టా చెబుతోంది. ఇలా అడ్డంగా మేస్తూ కులాంతర ప్రేమ వివాహ వివాదం కేసు మాఫీకి లంచం డిమాండ్ చేయడంతో చేన్నేకొత్తపల్లి పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ, సీఐపై అవినీతి నిరోధక శాఖ గురిపెట్టింది. ఆ శాఖ దాడుల్లో కనగానపల్లి ఎస్ఐ దొరికిపోగా.. రామగిరి సీఐ పరారై ఖాకీ వ్యవస్థకు మచ్చ తెచ్చిపెట్టారు. లంచం డిమాండ్ చేస్తూ ఏసీబీ కేసు నమోదు చేసిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చిన్నగౌస్ అవినీతి భరించలేకపోతున్నామనీ, బదిలీ చేయాలని అధికార పార్టీ వారే డీజీపీకి అక్రమాల చిట్టాతో ఫిర్యాదు చేశారంటే పరిస్థితిని ఊహించుకోవచ్చు. తనకు అధికార పార్టీ అండ ఉందని చెలరేగిపోయిన సీఐపై ఏకంగా ఆ పార్టీ నేతలే టార్గెట్ చేయడం పోలీసు శాఖలో చర్చనీయాంశంగా మారింది.

చిట్టా చాంతాడంత

లంచం డిమాండ్ చేస్తూ ఏసీబీకి దొరికిన ఎస్ఐ, సీఐలాగానే జిల్లాలో చాలా పోలీసు స్టేషన్లలో అసలు డబ్బులివ్వనిదే ఏపనీ జరగని పరిస్థితి నెలకొంది. కేసు కట్టాలన్నా.. పేరు తొలగించాలన్నా ఇలా.. ప్రతి దానికీ ధరను నిర్ణయిచి, ముక్కుపిండి వసూలు చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి. న్యాయం కోసం వచ్చే వారిని డబ్బుల కోసం వేధించడం పరిపాటిగా మారింది. సివిల్ పంచాయితీల్లో ఖాకీ మునిగి తేలుతూ అధికార పార్టీ నేలలతో కుమ్మక్కై సెటిల్మెంట్లు చేస్తున్నారన్నది బహిరంగ రహస్యమే. అసాంఘిక శక్తులతో ములాఖత్ అవుతూ భూసెటిల్మెంట్లు, పంచాయతీలు, మట్కా, గుట్కా, పేకాట, కర్ణాటక మద్యం, గంజాయిని ఆదాయ వనరులుగా మలచుకుంటున్నట్లు విమర్శలున్నాయి. పెనుకొండ, హిందూపురం, కదిరి, ధర్మవరం డివిజన్లలో ఇటీవల జిల్లా స్థాయి అధికారుల విచారణలో అవినీతి అధికారులు, సిబ్బంది చిట్టా చాంతాడంత వెలుగులోకి వచ్చినట్లు తెలిసింది. అయినా వారిపై చర్యలు తీసుకునేందుకు వెనకాడాల్సి వస్తోంది. అధికార పార్టీ ప్రజాప్రతినిధుల సిఫార్సులతో వచ్చిన వారిని కదిలించడం అంత సులువు కాదన్న చర్చ నడుస్తోంది. మూడేళ్లుగా ఒకే సర్కిల్‌లో సీఐగా పని చేస్తూ విచ్చలవిడిగా అక్రమార్జనకు పాల్పడుతూ ఏసీబీ దాడులు చేసేదాకా పరిస్థితి వచ్చినా.. ఉన్నతాధికారులు ఎందుకు గుర్తించలేదన్న విమర్శలున్నాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపంతోనే యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడుతున్నారన్న వాదనలు లేకపోలేదు. ఇందుకు లంచావతారమెత్తి ఏసీబీకి దొరికిపోయిన రామగిరి సీఐ, కనగానపల్లి ఎస్ఐ ఉదంతమే నిదర్శనం.







నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలకృష్ణ

ఎన్నికలకు సిద్ధం కండి

నాయకులతో ఎమ్మెల్యే బాలకృష్ణ

హిందూపురం, జనవరి 7: ఎన్నికలు సమీపిస్తున్నాయనీ, నాయకులు, కార్యకర్తలు సిద్ధం కావాలని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. నియోజకవర్గంలో నాలుగు రోజుల పర్యటన నిమిత్తం ఆదివారం బాలకృష్ణ హిందూపురం చేరుకున్నారు. ఎమ్మెల్యే తన నివాసంలో సాయంత్రం వరకు నాయకులు, కార్యకర్తలతో బిజీబిజీగా గడిపారు. పట్టణంలోని రహమత్‌పురానికి చెందిన టీడీపీ నాయకుడు దాదు సోదరి వివాహానికి బాలకృష్ణ హాజరై, వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం ఎమ్మెల్యే నివాసంలో కౌన్సిలర్లు, ముఖ్య నాయకులతో విడివిడిగా సమావేశమయ్యారు. మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలు, పరిగి బస్టాండులో అనుమతులు లేకుండా షెడ్ల నిర్మాణం, మున్సిపాలిటీలో దందాలు, అక్రమాలపై ఆరా తీశారు. ఎప్పటికప్పుడు ప్రజాసమస్యలపై స్పందించాలని కౌన్సిలర్లకు సూచించారు. అధికార పార్టీ అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ఎప్పటికప్పుడు స్పందించాలన్నారు. అనంతరం నియోజకవర్గ ముఖ్యనేతలతో సమావేశమై ఎన్నికలకు సమాయత్తం కావాలనీ, ఇప్పటి నుంచే ప్రతి నాయకుడు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఎన్నికలకు ఎలా వెళ్లాలనే దానిపై చర్చించినట్లు తెలిసింది.

మూడు రోజులు సమీక్షలే..

సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జేవీఎస్ ఫంక్షన్ హాల్‌లో హిందూపురం రూరల్ మండల పరిధి పంచాయతీల వారీగా ఎమ్మెల్యే సమీక్షలు నిర్వహించనున్నారు. మంగళ, బుధవారాల్లో హిందూపురం పట్టణ నాయకులతో సమీక్ష చేయనున్నారు. వారికి దిశానిర్దేశం చేయనున్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబికా లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్యదర్శి కొల్లకుంట అంజినప్ప, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బేవనహళ్లి ఆనంద్, నాయకులు నాగరాజు, చంద్రమోహన్, రమేష్ ప్రెస్ వెంకటేష్ సతీష్‌కుమార్, రాఘవేంద్ర, నవీన్, ఇందాద్ పాల్గొన్నారు.

వివాహానికి హాజరైన బాలకృష్ణ



ప్రభుత్వం మొండివైఖరి వీడాలి

సమగ్రశిక్ష ఉద్యోగుల డిమాండ్

పుట్టపర్తిరూరల్, జనవరి 7: సమగ్రశిక్ష ఉద్యోగుల పట్ల ప్రభుత్వం మొండివైఖరి విడనాడాలని సమగ్రశిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా జేఏసీ నాయకుడు ఓబిరెడ్డి డిమాండ్ చేశారు. సమగ్రశిక్ష ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న నిరవధిక సమ్మె 19వ రోజుకు చేరుకుంది. జేఏసీ నాయకుడు ఓబిరెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగులకు ప్రభుత్వం కల్పించాల్సిన కనీస వేతనం, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించకుండా శ్రమదోపిడీ చేయడం ఎంతవరకు న్యాయమన్నారు. ఉద్యోగుల్ని బెదిరించే స్థాయికి అధికారులు దిగజారారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేసు మాట్లాడుతూ.. సమగ్రశిక్ష ఉద్యోగుల పట్ల రాష్ట్ర అధికారి శ్రీనివాసరావు అవలంబిస్తున్న వైఖరి సరికాదన్నారు. ఆయన తీరు మారకపోతే రాష్ట్ర కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. చలో విజయవాడ కార్యక్రమంలో సమగ్రశిక్ష ఉద్యోగులు వేలాది మంది పాల్గొంటే పోలీసులను ఉపయోగించి ఉద్యమాన్ని అణచాలని చూసినా.. కార్యక్రమం విజయవంతం కావడాన్ని ప్రభుత్వం గమనించాలన్నారు. ఇప్పటికైనా సమగ్రశిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు నాగరాజు, ఓబులేసు, బాబ్జాన్, హరిప్రసాద్,భవాని, స్రవంతి, ఈశ్వరి, భాగ్యమ్మ, ఆనంద్, రాజశేఖర్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.



పుట్టపర్తి ఆర్డీఓ కార్యాలయం ముందు సమ్మెలో పాల్గొన్న సమగ్ర శిక్ష ఉద్యోగులు



ధర్మవరంలో జీఓ నంబర్ 2 ప్రతులను దహనం చేస్తున్న అంగన్‌వాడీలు

దీక్షలు కొనసాగిస్తాం

■ అంగన్‌వాడీల ఉద్ఘాటన

పుట్టపర్తిరూరల్, జనవరి 7: తమ సమస్యలను పరిష్కరించే వరకు దీక్షలు కొనసాగిస్తామని అంగన్‌వాడీలు ఉద్ఘాటించారు. జిల్లావ్యాప్తంగా అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం 27వ రోజుకు చేరుకున్నాయి. జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరాహార దీక్షల రెండోరోజు కదిరి, నల్లచెరువు ప్రాజెక్టుల నేతలు దీక్ష చేపట్టారు. అంగన్‌వాడీలు పెద్దఎత్తున్న హాజరయ్యారు. అంగన్‌వాడీల సంఘం నేత శ్రీదేవి మాట్లాడుతూ.. ప్రభుత్వం జీఓ నంబరు 2 పేరుతో ఎస్మా ప్రయోగించినా.. బెదిరేదిలేదన్నారు. ఉద్యోగాల నుంచి తొలగిస్తామన్నా సమ్మెను విరమించబోమన్నారు. సమస్యలను పరిష్కరించే వరకు సమ్మె కొనసాగించి తీరుతామన్నారు. దీక్షలకు పలు సంఘాల నేతలు సంఘీభావం తెలిపారు. జీఓ నంబర్ 2 ప్రతులను అంగన్‌వాడీలు హిందూపురం, ధర్మవరం, పెనుకొండ, మడకశిర, అగళి, బత్తలపల్లి, నంబులపూలకుంట, ముదిగుబ్బ తదితర చోట్ల దహనం చేశారు. హిందూపురంలో తహసీల్దార్ కార్యాలయం నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ చేపట్టారు. జీఓ నంబర్ 2 ప్రతులను కాల్చేశారు.

సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు ఉధృతం

• ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజనేయులు హెచ్చరిక



నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

ధర్మవరం, జనవరి 7: ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళనలను ఉధృతం చేస్తామని ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి అంజనేయులు హెచ్చరించారు. పట్టణంలోని మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారం 13వ రోజూ కొనసాగింది. వారికి అంజనేయులుతో పాటు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి జేవీరమణ, ఏపీచేనేత కార్మిక సంఘం తాలూకా అధ్యక్షుడు వెంకటస్వామి, కార్యదర్శి వెంకటనారాయణలు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కార్మికులతో పాటు వారందరూ కూడా గాంధీసర్కిల్లో రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టారు. అనంతరం మానవహారంగా ఏర్పడి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి మాట్లాడుతూ.. ప్రభుత్వం కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ సౌకర్యం కల్పించాలని, ఇంజనీరింగ్ కార్మికులకు హెల్త్, రిస్క్ అలవెన్సులు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యల్ని వెంటనే పరిష్కరించాలన్నారు. లేకపోతే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకుడు పోలా లక్ష్మినారాయణ, మున్సిపల్ కార్మికసంఘం, ఔట్‌సోర్సింగ్ ఇంజనీరింగ్ విభాగపు ఉద్యోగ కార్మికసంఘం ప్రతినిధులు, నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో స్పందన

పుట్టపర్తి, జనవరి 7: స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం జిల్లాస్థాయి స్పందన అర్జీల కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ అరుణ్‌బాబు ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ఎన్నికల నియమావళి కచ్చితంగా పాటించాలి

కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి, జనవరి 7: ఎన్నికల నియమావళిని కచ్చితంగా పాటించి, జిల్లాలో పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియ సాగేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. ఆదివారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లాలోని నియోజకవర్గ సహాయ ఎన్నికల అధికారులతో సమీక్షించారు. ఈనెల 9, 10 తేదీల్లో విజయవాడలో ఎన్నికల నిర్వహణపై కలెక్టర్లు, ఎస్పీలతో సమీక్ష నేపథ్యంలో ముందస్తు ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్షించారు. ఇప్పటివరకు తీసుకున్న చర్యలపై అధికారులను అడిగి సమగ్ర వివరాలు తెలుసుకున్నారు. సమావేశంలో పెనుకొండ సబ్ కలెక్టర్ భరత్, ఎన్‌రోల్‌మెంట్ సూపరింటెండెంట్ రవికుమార్, డీఆర్వో కొండయ్య, ఆర్డీఓలు భాగ్యరేఖ, రమేష్‌రెడ్డి, వంశీకృష్ణ పాల్గొన్నారు.



విజేత అనంత స్పోర్ట్స్ అకాడమీ బాలికల జట్టు

ఫుట్‌బాల్ లీగ్ విజేత అనంత స్పోర్ట్స్ అకాడమీ జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 7: ఫుట్‌బాల్ లీగ్ పోటీల్లో అనంత స్పోర్ట్స్ అకాడమీ బాలికల జట్టు విజేతగా నిలిచింది. వారం రోజులుగా అనంత క్రీడాగ్రామం-ఆర్డీటీ, లాలిగ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బాలికల ఫుట్‌బాల్-2024 లీగ్ పోటీలు నిర్వహించారు. ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో గుజరాత్ నాంది జట్టుపై 3పాయింట్ల తేడాతో అనంత స్పోర్ట్స్ అకాడమీ జట్టు విజయం సాధించింది. ఎఫ్‌సీ (గోవా), లిబర్టీ లేడీస్ (తమిళనాడు), లైఫ్ స్పోర్ట్స్ (తమిళనాడు), గుజరాత్ స్పోర్ట్స్ స్కూల్, మహిళా జన్ అధికార సమితి (రాజస్థాన్), అనంతపురం (యునైటెడ్) జట్లు తర్వాతి స్థానాల్లో నిలిచాయి. గ్రామీణ ప్రాంతాల బాలికలను క్రీడల్లో ప్రోత్సహించి ఉన్నత స్థానాలకు చేర్చడమే లక్ష్యంగా ఆర్డీటీ, లాలిగా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఐదేళ్లుగా లీగ్ నిర్వహిస్తున్నామని అధికారులు తెలిపారు. 8జట్లు, 144మంది క్రీడాకారులు లీగ్‌లో భాగస్వాములు అయ్యారన్నారు. అనంతరం ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ, కోఆర్డినేటర్ దాదాఖలందర్‌ల చేతుల మీదుగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

మెడికల్ రెప్స్ కార్యవర్గం ఎంపిక

అనంతపురం టౌన్ జనవరి 7: అనంత జిల్లా మెడికల్ రెప్స్, సేల్స్ నూతన కమిటీని ఎంపిక చేశారు. ఆదివారం జేవీవీ కార్యాలయంలో సమావేశమై ఈ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అమర్నాథ్, కార్యదర్శిగా విజయ్‌నాయుడు, ఉపాధ్యక్షుడిగా వెంకటేష్, నరేంద్ర, సహాయ కార్యదర్శులుగా రామాంజినేయులు, నాగరంగయ్య ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో పూర్వపు అధ్యక్షుడు రాజమోహన్ పాల్గొన్నారు.



ఎండిపోయిన పిల్ల కాలువ

ప్రచారం మిన్న.. ప్రవాహం సున్న



తూము వద్ద చుక్క నీరూ లేని దృశ్యం

- మిరప రైతును నిండా ముంచిన వైసీపీ నేతలు
- జీబీసీకి సాగు నీరు ఇస్తామన్నారు.. మొండిచేయి చూపారు
- నీరందక పంటను పొలాల్లోనే వదిలేసిన రైతులు
- లక్షల్లో నష్టపోయామని ఆవేదన

విడపనకల్లు జనవరి 7: హంద్రీనీవా కాలువ నుంచి జీబీసీలోకి సాగు నీరు మళ్లించాం.. రైతు కష్టాలు తీరినట్లే..బంగారం పండినట్లే అని వైసీపీ నాయకులు జోరుగా ప్రచారం చేశారు. పాపం రైతులు తమ పంట పండిందని సంబరపడ్డారు. కానీ ప్రచారం చేసినంత జోరుగా నీరు కాలువలో పారలేదు. జీబీసీ ప్రధాన కాలువ కింద వేల ఎకరాల్లో సాగు చేసిన మిరప రైతులు నష్టాలతో విలవిలలాడుతున్నారు. ప్రభుత్వ పెద్దలు జీబీసీకి పూర్తి స్థాయిలో సాగు నీరు ఇస్తామంటూ మిరప రైతులను పక్కా ప్లాన్ ప్రకారం నిట్ట నిలువునా మోసం చేశారు. నెల రోజులుగా సాగు నీరు కోసం ఎదురు చూసిన రైతులకు నిరాశే మిగిలింది. హంద్రీనీవా కాలువ నుంచి జీబీసీలోకి సాగు నీరు మళ్లించామంటూ వైసీపీ నాయకులు భారీగా ప్రచారం నిర్వహించారు. కానీ ఇచ్చింది మాత్రం కాలువకు కేవలం 10.15 క్యూసెక్కుల నీరే.. ఈ నీరు జీరో టు జీరో నుంచి దాదాపుగా 35 కిలో మీటర్లు దూరం సాగాలి. కానీ కాలువలో పారుతున్నది అడుగు లోతు నీరు మాత్రమే. స్టార్టింగ్ పాయింట్ నుంచి మిరప రైతులు కాలువపై నీటి మోటార్లు ఏర్పాటు చేసుకుని పొలాలకు సాగు నీరు తోడుకుంటున్నారు దీంతో ఒక్క డిస్ట్రిబ్యూటరీకి నీరు పారలేదు. ప్రతీ ఆయకట్టు రైతు సాగు నీరు అందక ఏమి చేయాలో దిక్కు తోచక మిరప పొలాలను అలాగే వదిలేశారు. వైసీపీ నేతలు చేసిన మోసానికి నానా బూతులు తిట్టుకుంటూ, ఉసురు కొట్టుకు పోతారని శాపనార్థాలు పెడుతున్నారు. కనీసం 100 క్యూసెక్కుల నీరు జీబీసీకి ఇచ్చి ఉంటే ప్రతి రైతుకు వారం రోజులు సాగు నీరంది ఉండేది. అడుగెత్తు నీరు కూడా లేకపోవడంతో పంటలు పండక రైతు అప్పులపాలయ్యాడు. విధి లేక బళ్లారి జిల్లా నుంచి నీటి ట్యాంకర్లు తెప్పించి మిరప పంటకు తడి అందిస్తున్నారు. ఎకరాకు 10 ట్యాంకర్ల ప్రకారం వారానికి ఒక తడిగా రూ. 10వేలు ఖర్చు తప్పడం లేదు. పొలికి, గడేకల్లు, ఆర్ కొట్టాల, హావళిగి, విడపనకల్లు, వేల్పుమడుగు, జనార్ధన పల్లి రైతులు తీవ్రంగా నష్టపోయారు.



మిరపకు ట్యాంకర్ల ద్వారా నీరిస్తున్న రైతు

నిలువునా మోసం : సూరి, రైతు



15 ఎకరాలు కౌలుకు తీసుకొని 8 ఎకరాల్లో మిరప, 7 ఎకరాల్లో సీడ్ జొన్న సాగు చేశాను. పంటలు మంచి పట్టు మీద ఉన్న సమయంలో సాగు నీరు నిలిచిపోయింది. వైసీపీ నాయకులు జీబీసీ కాలువకు సాగు నీరు ఇస్తామంటూ కనీసం అడుగు ఎత్తుకూడా ఇవ్వకుండా చేసిన మోసం చేసిన పాపం ఊరికే పోదు.

ట్యాంకర్లే గతి : రామాంజనేయులు



నెల రోజులుగా సాగు నీటి కోసం ఎదురు చూసి చుక్క నీరు రాక పోవటంతో బళ్లారి నుంచి ట్రాక్టర్లను తెప్పించి, తడులు పెట్టుకుంటున్నాను. కనీసం ఓ నాలుగు ఎకరాల్లో పంటలను కాపాడుకున్నా అప్పులు ఊబి నుంచి బయట పడవచ్చు అనే చిన్న కోరికతో వేల రూపాయలు ఖర్చు పెట్టక తప్పడం లేదు.

లక్షల్లో నష్టం : హనుమంతు



దాదాపుగా 30 ఎకరాల్లో మిరప, 20 ఎకరాల్లో సీడ్ జొన్న పంటలను జీబీసీ కాలువ కింద సాగు చేశాను. సాగు నీరు వస్తుంది అని ఆశతో ఎదురు చూస్తున్న మాకు నిరాశే మిగిలింది. దాదాపుగా లక్షల్లో నష్టాలు పాలు అయ్యి అప్పుల ఊబిలో కూరుకు పోతున్నాను. ప్రభుత్వం నమ్మించి మోసం చేసింది. పెట్టుబడులు కూడా వచ్చేది కష్టమే.

పొలంలోనే వదిలేశా: నాగప్ప



ఆరు ఎకరాల్లో జీబీసీ కాలువ కింద ఎకరాకు రూ. 40 వేలు కౌలు చెల్లించి మిరప సాగు చేశాను. నెల రోజులుగా సాగు నీరు రాక పోవటంతో అలాగే వదిలేశాను. ఇప్పటికే రూ. 10లక్షలుకు పైగా అప్పులు చేసి పెట్టుబడులు పెట్టాను. అధికార పార్టీ నాయకులు నిండా ముంచేశారు.

ముగిసిన బాలవికాస్ వేడుకలు



బహుమతులను ప్రదానం చేస్తున్న ట్రస్టు సభ్యులు

పుట్టపర్తి, జనవరి 7: బాలవికాస్ 'అల్యూమిని' వేడుకలు రెండవ రోజు ఆదివారం ఘనంగా ముగిశాయి. ప్రశాంతినిలయంలోని సాయి కుల్వంత్‌లో మొదట విద్యార్థినులు, బ్యాండ్‌బ్రాడ్‌తో భక్తులను అలరింపచేశారు. అనంతరం వ్యాసరచన పోటీల్లోఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ట్రస్టు సభ్యులు ఆర్‌జే రత్నాకర్, చక్రవర్తి బంగారు పథకాలతో సత్కరించారు. బాలవికాస్ విద్యార్థులు కొయ్యకాళ్లతో చేసిన నృత్యం భక్తులను అబ్బురపరిచింది. కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల జాతీయ అధ్యక్షులు నిమిష్ పాండె, సేవాదల్ సభ్యులు పాల్గొన్నారు.



కొయ్యకాళ్లతో నృత్యం చేస్తున్న విద్యార్థులు

మోసం కేసులో మడకశిర ఎంఈఓ అరెస్టు

మడకశిరటౌన్, జనవరి 7: మోసానికి పాల్పడ్డారన్న ఆరోపణలపై మడకశిర ఎంఈఓ శ్రీనివాసభాస్కర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. తంబాళ్లపల్లి ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు 2021 సంవత్సరంలో సచివాలయంలో ఉద్యోగాలు ఇప్పిస్తామని నకిలీ నియామకపత్రాలతో నిరుద్యోగ యువతను ఎంఈఓ మోసం చేశారని తెలిపారు. సచివాలయంలో ఉద్యోగాల పేరుతో నకిలీ నియామక పత్రాలు సృష్టించి నిరుద్యోగ యువతకు ఇచ్చారని, ఆ పత్రాలతో విధుల్లో చేరడానికి అన్నమయ్య జిల్లా తంబాళ్లపల్లి ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లగా నియామక పత్రాలను పరిశీలించిన ఎంపీడీఓ అనుమానం వచ్చి తంబాళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఏ-3 నిందితుడిగా ఎంఈఓను చేర్చి, శనివారం అరెస్ట్ చేసినట్లు ఆయన వివరించారు.

యా(బా)ప్‌రే...!

- ఓపీకి ఆయుష్మాన్ భారత్ లింక్
- 'యాప్'డౌన్‌లోడ్ చేసుకుంటేనే ఓపీ చీటీ
- ఆధార్ లేకపోతే అంతే గతి...
- జిల్లా ఆస్పత్రిలో వింత పరిస్థితి



అనంతపురం టౌన్ జనవరి7: అష్టకష్టాలు పడి, అనేక బాధలతో వైద్యం కోసం ఆస్పత్రికి వచ్చే వారికి సాంకేతిక కష్టాలు చుక్కలు చూపిస్తున్నాయి. కేంద్రం ప్రవేశపెట్టిన 'ఆయుష్మాన్ భారత్' పథకాన్ని జిల్లా ఆస్పత్రిలో అమలు చేస్తున్నారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు ఆయుష్మాన్‌భారత్ యాప్ ద్వారా ఆన్‌లైన్ సేవలు అందించడం దీని ప్రధాన ఉద్దేశం. మొదట చికిత్స కోసం వచ్చే రోగులందరికీ ఆయుష్మాన్ భారత్‌యాప్‌ను డౌన్‌లోడ్ చేయిస్తున్నారు. యాప్ డౌన్‌లోడ్ చేసుకుంటేనే ఓపీ చీటీ రాసి ఇస్తున్నారు. ఇదే పెద్ద సమస్యగా మారింది. ఆధార్ కార్డును ఆస్పత్రి సిబ్బందికి ఇస్తే వారు 'ఆయుష్మాన్‌భారత్' యాప్‌లో వివరాలు నమోదు చేసి ఓ నెంబర్ ఇస్తారు. ఆనెంబరును ఓపీ కౌంటర్‌లో చూపిస్తేనే ఓపీ చీటీ ఇవ్వడం జరుగుతుంది. ఇదంతా పూర్తి కావాలంటే దాదాపు అరగంటనుంచి గంట సమయం పడుతోంది. అత్యవసర పరిస్థితి ఉన్న వారికి ఇబ్బంది తలెత్తుతోంది.



జిల్లా ఆస్పత్రిలో యాప్ డౌన్‌లోడ్‌కోసం రోగుల అవస్థలు

● ఆధార్ లేకపోతే అంతేగతి..

జిల్లా ఆస్పత్రికి అధిక శాతం నిరుపేద రోగులే వస్తుంటారు. అధికారిక లెక్కల మేరకు ప్రతిరోజూ 1200 నుంచి 1800 మంది వరకు వస్తున్నారు. సోమవారం అయితే ఓపీ 2వేలు దాటిపోతోంది. వీరందరూ ఆయుష్మాన్ భారత్ యాప్ డౌన్‌లోడ్ చేసుకొన్న తర్వాతే ఓపీ చీటీ ఇస్తున్నారు. కొద్ది మంది అవగాహన లేని వారు ఆధార్ లేకుండా వస్తుంటారు. వారికి ఓపీ టికెట్ ఇవ్వకుండా వెనక్కి పంపిస్తున్నారు. దీంతో ఆ రోగుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిపోతోంది. ఇదిలా ఉంటే సీరియస్ కేసులు ఎమర్జెన్సీకి తీసుకొచ్చినా అక్కడ కూడా ఈయాప్ ద్వారా ఓపీ తీసుకొని వెళ్లిన తర్వాతే చికిత్సలు, అడ్మిషన్‌లు చేస్తున్నారు. అలాంటివారి పరిస్థితి మరీ దారుణంగా ఉంటోంది.

● కావాలనే సమస్య సృష్టిస్తున్నారు..
: డాక్టర్ వెంకటేశ్వరరావు, ఆస్పత్రి సూపరింటెండెంట్



'ఆయుష్మాన్ భారత్' యాప్ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు అమలు చేస్తున్నాం. అది మంచి కార్యక్రమం, అయితే అది ఖచ్చితం అని నిబంధన లేదు. ఆస్పత్రికి రోజుకు 1800 మంది వరకు వస్తున్నారు అందరూ ఆధార్ కార్డులతో రాలేరు కదా అలాంటివారికి కౌంటర్‌లో ఓపీ చీటీలు ఇస్తున్నాం. కొందరు కావాలనే సమస్య సృష్టిస్తున్నారు. దీనిపై ప్రత్యేకంగా ఆరాతీస్తా, రోగులకు ఇబ్బంది లేకుండా చూస్తాం.

చేనేతను కాపాడుకోకపోతే ధర్మవరానికి మనుగడే లేదు

- మా ప్రభుత్వం వచ్చాక పాలిష్ కార్మికులను ఆదుకుంటాం
- పాదయాత్రలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్



పరిటాల శ్రీరామ్‌ను గజమాలతో సత్కరిస్తున్న టీడీపీ నాయకులు



మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారధి

ధర్మవరం, జనవరి 7: గుండెలాంటి చేనేత పరిశ్రమను కాపాడుకోకపోతే ధర్మవరానికి మనుగడే ఉండదని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్ అన్నారు. ధర్మవరం పట్టుచీరలంటే ప్రపంచంలోనే ఒక ప్రత్యేక గుర్తింపు ఉందని, కానీ అది రోజురోజుకూ కనుమరుగవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు పాదయాత్ర నాల్గవ రోజు ఆదివారం పట్టణంలో పలు కాలనీల్లో ఆయన టీడీపీ నాయకులతో కలిసి పర్యటించారు. కన్యకాపరమేశ్వరిదేవి ఆలయం నుంచి దిగువగేరి, బడేసాహేబ్‌వీధి, బోయవీధి,మార్కెట్‌వీధి, దర్గావీధి, లోనికోట, యాదవవీధి, వరలక్ష్మీథియోటర్ వరకు పాదయాత్ర సాగింది. అన్ని కాలనీల్లో ప్రజలు పరిటాల శ్రీరామ్‌కు పూలవర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు. ఓ వైపు 'బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహిస్తూనే మరో వైపు ప్రజల సమస్యలను అడిగితెలుసుకున్నారు. మార్గమధ్యలో చేనేత కార్మికులతో పరిటాలశ్రీరామ్ సమావేశమయ్యారు. ముడిసరుకుల ధరలు పెరిగిపోవడం వల్ల నేసినప్పటికీ గిట్టుబాటు ధరలేకుండా పోయిందని, కరోనా సమయం నుంచి కోలుకోలేకుండా నష్టపోతున్నామని, కార్మికులు ఆవేదన వ్యక్తంచేశారు. మరోవైపు పవర్‌లూమ్స్ రావడం వల్ల హ్యాండ్‌లూమ్ వ్యవస్థ తీవ్ర సంక్షోభంలోకి కూరుకుపోయిందన్నారు. చేనేత పరిశ్రమను కాపాడాలంటే నేత కార్మికులకు తగిన ప్రోత్సాహకాలు అందించాలని విజ్ఞప్తిచేశారు. స్పందించిన పరిటాలశ్రీరామ్ గత టీడీపీ హయాంలో చేనేతలకు అన్ని రకాల సబ్సిడీలు ఉండేవని, కానీ ఇప్పుడు ఎక్కడా అలాంటి పరిస్థితి కనిపించడం లేదన్నారు. వైసీపీ ప్రభుత్వం చేనేత కార్మికులను మరింత కష్టాల్లోకి నెట్టిందని విమర్శించారు. మరోవైపు పాలిష్ కార్మికులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గతంలో లాభదాయకంగా ఉన్న ఈ వృత్తి ఇప్పుడు భారంగా మారుతోందన్నారు. చీరలకు వేసే గమ్ ధరలు విపరీతంగా పెరిగిపోవడమే కాకుండా జీఎస్టీ కూడా వేయడం పాలిష్ వృత్తిపై ఆధారపడిన వారు ఆదాయం కోల్పోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఆరోగ్యశ్రీ కూడా కార్మికులకు వర్తించలేదని, తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆరోగ్యశ్రీ వర్తింపచేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. జీఎస్టీ అంశంపై కూడా కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడతామని హామీ ఇచ్చారు. టీడీపీ హయాంలో ఉన్న సబ్సిడీలు ఎందుకు ఎత్తివేశారో వైసీపీ ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు.



సమస్యలపై స్థానికులతో ఆరా తీస్తున్న శ్రీరామ్

ధర్మవరం ప్రజలకు పరిటాల శ్రీరామ్ అండగా ఉంటారు: బీకే

పరిటాల శ్రీరామ్ చేపట్టిన పాదయాత్రలో సత్యసాయిజిల్లా టీడీపీ అధ్యక్షుడు, పెనుకొండ మాజీ ఎమ్మెల్యే బీకేపార్థసారథి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...చేనేత కార్మికులకు మొదటి నుంచి అండగా ఉండేది టీడీపీనేన్నారు. ప్రస్తుతం టీడీపీ విజయం సాధించడం తమ పార్టీకి మాత్రమే కాకుండా ప్రజలకు కూడా చాలా అవసరమన్నారు. పరిటాలశ్రీరామ్ చేపట్టిన పాదయత్రకు మంచి స్పందన వస్తోందని ఆయన అన్నారు. ధర్మవరంలాంటి ప్రాంతంలో అరాచకాలకు అడ్డుకట్ట వేసి ప్రజలు ప్రశాంతంగా జీవించాలంటే పరిటాలశ్రీరామమ్ లాంటి ధైర్యవంతులైన వ్యక్తి అవసరమన్నారు. శ్రీరామ్ ఎమ్మెల్యే అయిన తరువాత ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తారన్నారు. కల్లోలంగా మారిన ధర్మవరాన్ని శ్రీరామ్ ప్ర శాంతంగా మారుస్తారన్నారు. మరో మూడు నెలల్లో ఎన్నికలు రాబోతున్నాయని ప్రజలంతా ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని ఆయన విజ్ఞప్తిచేశారు.

మితిమీరిన వైసీపీ గూండాల దౌర్జన్యాలు

- జయహో బీసీ సభలో మాజీ మంత్రి కాలవ విమర్శ



జయహో బీసీ రథాన్ని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు

బొమ్మనహాళ్, జనవరి 7: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో అవినీతి, అసమర్థత వైసీపీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో గూండాల ఆగడాలు, దౌర్జన్యాలు రాజ్యమేలుతూ బీసీలను అణగదొక్కుతున్నారని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు విమర్శించారు. ఆదివారం బొమ్మనహాళ్ మండలంలోని ఏళంజి, కానాపురం గ్రామాలలో జయహో బీసీ, బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కురుబ, గాండ్ల, వడ్డెర్ల, వాల్మీకి తదితర బీసీ సాధికారిక రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు కురుబ రమణ, ఆవుల క్రిష్ణయ్య, గాండ్ల విశాలాక్షి, ప్రతాప్‌నాయుడు, పోతులయ్య, వడ్డే వెంకట్, పోలన్న తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ పేరుతో దోపిడీ, అధికారాన్ని ఉపయోగించుకుని దౌర్జన్యాలతో రాజ్యమేలుతున్నారని విమర్శించారు. గతంలో చంద్రబాబు పాలనలో జన్మభూమి కార్యక్రమం పెట్టి అధికారులను ప్రజల మధ్యలో తీసుకొచ్చి తాగునీటి సౌకర్యం, పెన్షన్, రేషన్‌కార్డులు ఇచ్చేవారమన్నారు. వైసీపీ పాలనలో కొత్తవి పెన్షన్ కంటే తొలగించినవే ఎక్కువ ఉన్నాయని, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో ఒక్క ఇల్లు కూడా నిర్మించలేదని కేంద్రం ఇచ్చే నిధులను కూడా మింగేస్తున్నారని విమర్శించారు. ఇలాంటి అవినీతి, అసమర్థత పాలన ఎప్పుడూ చూడలేదని రాష్ట్రంలో 12 సార్లు కరెంటు బిల్లులు పెంచి, బస్సు చార్జీలు, గ్యాస్ ధరలు, నిత్యావసర సరుకుల ధరలను విపరీతంగా పెంచారన్నారు. బీసీలను రాష్ట్రంలో అణగదొక్కుతూ వందలాది మందిని పొట్టనపెట్టుకొని కేసులు మోపుతూ బీసీలకు రక్షణ లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాచైతన్యమే లక్ష్యంగా టీడీపీ ఆధ్వర్యంలో జయహో బీసీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కాలవ అన్నారు. జయహో బీసీ కార్యక్రమానికి ఏర్పాటు చేసిన రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు. తెలుగుదేశం, జనసేన ప్రభుత్వకూటమిలో బీసీలకు చేయబోయే కార్యక్రమాలన్నింటిని అందిస్తామని అన్నారు. ఒక్క అవకాశం అంటూ తండ్రిలేని బిడ్డ అని తోడుగా ఉంటారని జగన్ మోహన్‌రెడ్డిని చూసి ఓట్లు వేశారని, కానీ ఈ రోజు అందరూ బాధపడుతున్నారని తెలిపారు. బూటకపు నాటకాలను నమ్మకండని బీసీ సాధికారిక నాయకులు అన్నారు. అభ్యర్థులను మార్చినంత మాత్రాన వారి స్వభావాలు మారుతాయా, అరాచక ప్రభుత్వాన్ని అంతమొందించాలన్నారు. కార్యక్రమంలో తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు కొండాపురం కేశవరెడ్డి, టీడీపీ, జనసేన మండల కన్వీనర్లు బలరాంరెడ్డి, హనుమంతరెడ్డి, హనుమంతు, శివరాజ్, సింగిల్ విండో మాజీ అధ్యక్షులు కొత్తపల్లి మల్లికార్జున, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షులు యర్రగుంట్ల వెంకటేశులు, మాజీ కన్వీనర్ చలపతి, టీడీపీ సీనియర్ నాయకులు అప్పారావు, మాజీ డైరెక్టర్ మ హేంద్ర, పయ్యావుల అనిల్, క్లస్టర్ కన్వీనర్ ధనుంజయ, పయ్యావుల మోహన్, కావలి రాము, కావలి ప్రభు, నవీన్, సైకిల్ షాప్ హనుమంతు, మండల మహిళా అధ్యక్షురాలు శ్యామల, జనసేన నాయకులు సికిందర్, లోకేష్, శివ, తదితరులు పాల్గొన్నారు.

కబ్జాలు ఫుల్.. అభివృద్ధి నిల్..

- ధర్మవరాన్ని దౌర్జన్యాలకు కేంద్రంగా మార్చిన కేతిరెడ్డి : మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల

ధర్మవరం, జనవరి 7: ధర్మవరం నియోజవకర్గంలో నాలుగున్నర ఏళ్ల కాలంలో అభివృద్ధి జరగకపోయినా భూ కబ్జాలు పెరిగిపోయాయని మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ పేర్కొన్నారు. ఆదివారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ హయాంలో దౌర్జన్యాలు, రౌడీయిజం పెరిగిపోయాయని ప్రశాంతంగా ఉన్న ధర్మవరం నియోజకవర్గాన్ని అరాచకాలకు, దౌర్జన్యాలకు, అడ్డాగా మార్చిన ఘనత ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డికి చెల్లుతుందన్నారు. టీడీపీ గత ఐదేళ్లకాలంలో నియోజకవర్గంలో రూ.3,400 కోట్ల రుపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామని, ఎమ్మెల్యేకేతిరెడ్డి మాత్రం ప్రజల రక్తాన్ని పీల్చిరూ.4వేల కోట్లు అక్రమంగా సంపాదించారని ఆరోపించారు. తాము అధికారంలోకి రాగానే సిట్ ఏర్పాటు చేసి కబ్జా చేసిన భూములను స్వాధీనం చేసుకుంటామన్నారు. గుడ్‌మార్నింగ్‌ను ఎమ్మెల్యే కబ్జా మార్నింగ్‌గా మార్చారన్నారు. ధర్మవరంలో కొత్తఇళ్ల నిర్మాణం, స్థలాల రిజిస్ట్రేషన్, వాహనాల కొనుగోలు చేసినా ఆయనకు కప్పం కట్టాల్సి రావడం దురదృష్టకరమన్నారు. వైసీపీ కార్యకర్తలు కేతిరెడ్డిని చిత్తుచిత్తుగా ఓడిచేందుకు తనకు మద్దతు పలుకుతున్నారని, చాలా మంది కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, టీడీపీ విజయానికి కృషిచేస్తామంటున్నారన్నారు.

ధర్మవరం ప్రజలకు నాలుగు హామీలు

మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణకు ధర్మవరం ప్రజలకు నాలుగు హామీలిచ్చారు. ఆ హామీలను 2024-29లో నెరవేర్చిన తరువాతే మళ్లీ 2029లో ఓటు అడిగేందుకు ప్రజల ముందుకు వెళ్తానన్నారు. గతంలో ధర్మవరాన్ని సస్యశ్యామలం చేసేందుకు హంద్రీనీవా ద్వారా సాగు, తాగు నీటిని తీసుకువస్తానన్నారు. గతంలోనే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టానన్నారు. సకాలంలో పనులు పూర్తీ కాలేదన్నారు. వైసీపీ అధికారంలోకి రావడంతో ఆ కార్యక్రమాన్ని అడ్డుకోవడం జరిగిందన్నారు. చేనేత కార్మికుల సంక్షేమం కోసం చేనేత క్లస్టర్‌ను ఏర్పాటుచేసి పదివేల మంది కార్మికులకు ఉపాధి కల్పిస్తానన్నారు. వచ్చే ఎన్నికలలో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని వెంటనే మెడికల్ కాలేజ్ నిర్మాణం చేపడ్తామన్నారు. నియోజవర్గానికి సోలార్‌ప్రాజెక్టు కూడా ఏర్పాటు చేసేందుకు కృషిచేస్తానని గోనుగుంట్ల నియోజకవర్గ ప్రజలకు హామీ ఇచ్చారు. సమావేశంలో నాయకులు డిష్‌రాజు, తుంపర్తిపరమేశ్, బోడగలగిరిధర్, దుస్సాక్రిష్ణ, నారాయణస్వామి, దేవేంద్రనాథ్‌రెడ్డి, గొట్లూరుచంద్ర, రాప్తాటిరాము పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల

టీడీపీలోకి 50 కుటుంబాల చేరిక


టీడీపీలోకి చేరిన వారితో కందికుంట వెంకట ప్రసాద్

కదిరి, జనవరి 7: నంబులపూలకుంట మండలం పి.కొత్తపల్లి పంచాయతీలోని ఎగువ, దిగువపల్లి గ్రామాలతో పాటు దళివాడకు చెందిన సుమారు 50 కుటుంబాల వైసీపీ వారు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పట్టణంలో ఆదివారం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ సమక్షంలో వారు చేరారు. వారికి కందికుంట కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయానికి ప్రతిఒక్కరూ సైనికుల్లా పని చేయాలని సూచించారు. పార్టీలో చేరినవారిలో 9వార్డు మెంబరు వెంకటస్వామిరెడ్డి, మల్లిరెడ్డి, లవకుమార్‌రెడ్డి, వెంకటరామిరెడ్డితోపాటు 50కుటుంబాల వారు ఉన్నారు. కార్యక్రమంలో నాయకులు పి కొత్తపల్లి సర్పంచ్ శ్రీరాములు, మండల కన్వీనర్ చంద్రశేఖర్‌నాయుడు, అంజినప్పనాయుడు, వంకమద్ది నరసింహులు, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం నాట్యకళాకారులకు అవార్డులు


అవార్డులు పొందిన ధర్మవరం నాట్యకళాకారులు

ధర్మవరం, జనవరి 7: హైదరాబాద్‌లోని బీరంగూడ గుట్టలో గల భ్రమరాంబికా మల్లికార్జున స్వామి ఆలయంలో వాగ్దేవి సకల కళా సంస్థ వారు సంక్రాంతి సంబరాలు ను ఆదివారం నిర్వహించారు. ఇందులో ధర్మవరానికి చెందిన శ్రీలలిత నాట్యకళానికేతన్ నాట్యాచార్యులు బాబూబాలాజీ, కమల బాలాజీ శిష్యబృందం 17 మంది పాల్గొని ప్రతిభ కనబరచి నాట్య సంకల్ప అవార్డును, సంక్రాంతి నంది అవార్డును పొందినట్లు నాట్యాచార్యులు బాబూబాలాజీ పేర్కొన్నారు. దీంతో సంస్థ నిర్వాహకులు నాట్య ఆచార్యులను, శిష్యబృందంను ప్రశంసాపత్రాలు అందజేసి సత్కరించారు.

ఆపదలో ఉన్న వారికి అండగా ఉంటా: గోనుగుంట్ల

● పలు కుటుంబాలకు ఆర్థికసాయం


పోలా రామాంజనేయులు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గోనుగుంట్ల

ధర్మవరం, జనవరి 7: ఎవరు ఆపదలో ఉన్నా.. వారికి అండగా నిలిచి ఆదుకుంటామని మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ పేర్కొన్నారు. పట్టణంలో ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన వారి కుటుంబాలను ఆదివారం ఆయన పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. ముందుగా శివానగర్‌లోని శివాలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం వివిధ ప్రాంతాల్లో అనారోగ్యంతో మృతిచెందిన పలువురి కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయం చేశారు. అందులో చౌడమ్మ, షేక్ మహబూబ్ బాషా, పోలా రామాంజనేయులు, నామా రామాంజనేయులు, బాలాజీ, చెన్నంశెట్టి సుబద్రమ్మ, లక్ష్మమ్మ , ప్రకాశ్, కే. శ్రీనివాసులు, సున్నపురాళ్ల కార్తీక్, తిమ్మప్పల కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.15వేల చొప్పున అందజేశారు. ఆత్మహత్య చేసుకున్న చేనేత కార్మికుడు వనం శ్రీనివాసులు, రమేష్ కుటుంబాలకు కూడా ఒక్కో కుటుంబానికి రూ.15వేల చొప్పున అందించారు. ఇక మల్లేనిపల్లి లక్ష్మీనారాయణకు వైద్యఖర్చుల కోసం రూ.10వేల ఆర్థికసాయం చేశారు. ఆయన వెంట అనుచరులు డిష్‌రాజు, తుంపర్తిపరమేశ్, బోడగలగిరిధర్, దుస్సాకృష్ణ, సరితాల దస్తగిరి, గుండాపుల్లయ్య, చిలకం సూర్యనారాయణ రెడ్డి, నారాయణస్వామియాదవ్, నబీరసూల్ తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


తమ ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

కదిరిఅర్బన్, జనవరి 7: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 1973-74వ విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఒక్కచోట కలిశారు. సుమారు 50 ఏళ్ల తర్వాత అందరూ ఒక చోట చేరడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులు సుబ్బరాయుడు, శివారెడ్డి, రామచంద్రారెడ్డి, వెంకటేశులు, గంగారెడ్డిని శాలువా, పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అత్తార్ మహబూబ్‌బాషా, ఎల్ రెడ్డి, శ్రీనివాసులు, రఫీవుల్లా, వేమనారాయణ, భాస్కర్‌రెడ్డి, అజంతుల్లా ఖాన్, శివశంకర్‌రెడ్డి, ఎస్ఎండీ బాషా, రామలింగయ్య, ఎంఎస్ పార్థసారథి, రమేష్ తదితరులు ఉన్నారు.

మెకానిక్‌పై హత్యాయత్నం


గాయపడిన శ్రీధర్

కదిరి, జనవరి 7: మెకానిక్‌పై హత్యాయత్నం జరిగిన సంఘటన ఆ దివారం రాత్రి పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణ సీఐ నారాయణ రెడ్డి తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని చౌక్ బజారులో మెకానిక్‌గా పని చేస్తున్న శ్రీధర్‌పై బాలు అలియాస్ బాలకృష్ణ, అతని స్నేహితుడు కలిసి పవన్‌ను కత్తితో పొడిచి హత్య చేయడానికి యత్నించారు. గతంలో వీరి మధ్య సెల్‌ఫోన్ విషయంపై గొడవ జరిగింది. దీంతో పాత కక్షలు మనసులో పెట్టుకొని బాలు తన స్నేహితుడుతో కలిసి శ్రీధర్‌ను విచక్షణా రహితంగా కత్తితో పొడిచారు. ఆ సమయంలో చుట్టుపక్కల వారు రావడంతో వారు పారిపోయారు. వెంటనే శ్రీధర్‌ను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యులు మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. శ్రీధర్ భార్య జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాలు, పవన్‌తో పాటు హత్య చేసేందుకు ప్రోత్సహించారని సీపీఐ నాయకుడు ఇషాక్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

హెల్త్ సెక్రెటరీలను గ్రేడ్-2 ఉద్యోగులుగా గుర్తించాలి

హిందూపురం అర్బన్, జనవరి 7: సచివాలయ హెల్త్ సెక్రెటరీలను గ్రేడ్-2 ఉద్యోగులుగా గుర్తించాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పరిమళ డిమాండ్ చేశారు. స్థానిక మునిసిపల్ జేఏసీ కార్యాలయంలో ఆదివారం సచివాలయ హెల్త్ సెక్రెటరీల సంఘం, సభ్యుల సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖ, సచివాలయం రెండు శాఖలు మాపై అజమాయిషీ చెలాయిస్తున్నాయని మండిపడ్డారు. అలా కాకుండా ఒక్క శాఖ మాత్రమే అజమాయిషీ చేయలన్నారు. 42 యాప్‌లు ఉన్నాయని వాటితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఆ యాప్‌లను కుదించాలని డిమాండ్ చేశారు. హెల్త్ సెక్రెటరీలకు ప్రత్యేక గుర్తింపు కోసం ఐడీ కార్డులు, యూనిఫాం అందించాలన్నారు. గ్రేడ్ 3 నుంచి గ్రేడ్ 2 ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షురాలు రామాంజినమ్మ, ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వినోద్‌కుమార్, అధ్యక్షురాలు అంజినమ్మ, కార్యదర్శి మాధవి, గౌసియా, సరిత, యశోదరాణి, ఏఐటీయూసీ తాలుకా సహాయ కార్యదర్శి ఇస్మాయిల్, బాలస్వామి పాల్గొన్నారు.

ప్రభుత్వంపై అంగన్‌వాడీల ఆగ్రహం


ఓడీసీలో జీవో 2 ప్రతులను దహనం చేస్తున్న అంగన్‌వాడీలు


ముదిగుబ్బలో..

● జీఓ 2 ప్రతుల దహనం ● 27వ రోజూ కొనసాగిన సమ్మె

ధర్మవరం, జనవరి 7: సమ్మెను విరమింపజేయాలని ప్రభుత్వం ఎస్మా ప్రయోగం చేసిందుకు అంగన్‌వాడీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో జీఓ నంబర్ 2 ప్రతులను దహనం చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట వారు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం నాటికి 27వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా దీక్షా శిబిరం వద్ద అంగన్‌వాడీలతో పాటు రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, సీపీఎం సీనియర్ నాయకుడు ఎస్ హెచ్‌బాషా, సీఐటీయూ మండల అధ్యక్షుడు ఆదినారాయణ జీఓ ప్రతులను దహనం చేశారు. అనంతరం రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న మాట్లాడుతూ.. అంగన్‌వాడీలు 27 రోజులుగా సమ్మె చేస్తుంటే.. ప్రభుత్వం వారి సమస్యలను పరిష్కరించకపోగా వారిపై కక్షసాధింపు చర్యలకు దిగుతోందని మండిపడ్డారు. ఇలాంటి జీఓలను ఎన్ని విడుదల చేసినా అంగన్‌వాడీలు పోరాటం ఆపరన్నారు. ప్రభుత్వం సమస్యల్ని పరిష్కరించాల్సిందేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి ఆంజనేయులు, రైతుసంఘం జిల్లా సహాయకార్యదర్శి జేవీరమణ, ఏపీచేనేత కార్మికసంఘం తాలూకా అధ్యక్షుడు వెంకటస్వామి, కార్యదర్శి వెంకటనారాయణ, సీపీఐ నాయకుడు పోలా లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

ముదిగుబ్బ: ఎస్మాకు సంబంధించిన జీఓ 2 ప్రతులను మండలకేంద్రంలోని అంగన్‌వాడీలు సీపీఐ ఆధ్వర్యంలో దహనం చేశారు. అనంతరం సమ్మెశిబిరంలో కూర్చొని విప్లవ గీతాలు ఆలపించారు. సీపీఐ మండల కార్యదర్శి చల్లాశ్రీనివాసులు, సీఐటీయూ మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, ప్రజానాట్యమండలి నాయకులు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.


నల్లమాడలో..

ఓబుళదేవరచెరువు: మండలంలోని అంగన్‌వాడీలు జీవో 2 ప్రతులను దహనం చేశారు. మహ్మదాబాద్‌క్రాస్‌లో గల సీడీపీఓ కార్యాలయం ఎదుట వారు ప్రతులను దహనం చేసి ప్రభుత్వం తమపై కక్ష సాధింపు చర్యలను ఆపాలని, మొండివైఖరి వీడాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు కుళ్లాయప్ప, శ్రీరాములు, ప్రాజెక్టు యూనియన్ అధ్యక్షురాలు ఆశీర్వాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

నల్లమాడ: మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు జీవోనెంబర్ 2 ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించేవరకు సమ్మె కొనసాగిస్తామని హెచ్చరించారు.

రోడ్డుపై భోజనం చేస్తూ మున్సిపల్ కార్మికుల నిరసన


కదిరిలోరోడ్డుపై భోజనం చేస్తూ నిరసన తెలుపుతున్న కార్మికులు


పుట్టపర్తిలో సమ్మెలో పాల్గొన్న మున్సిపల్ కార్మికులు

కదిరిఅర్బన్, జనవరి 7: తమసమస్యలు పరిష్కరించాలంటూ పట్టణంలోని మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారం నాటికి 13వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట రోడ్డుపై భోజనాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. వీరికి సీపీఐ, బీఎస్పీనాయకులు మద్దతు తెలిపారు. ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించేవరకు సమ్మె కొనసాగిస్తామని పలువురు కార్మికులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఐ, ఏఐఎస్ఎఫ్, బీఎస్పీ, మున్సిపల్ కార్మిక యూనియన్ నాయకులు ఇషాక్, రాజేంద్ర, కుటాగుళ్ల శంకర్, కోలా సురేంద్రనాథ్ బెనర్జీ, నాగరాజు, నూరి శ్రీనివాసులు, రాజు, గంగాద్రి పాల్గొన్నారు.

ప్రభుత్వం మొండి వైఖరి వీడాలి

పుట్టపర్తి: పట్టణంలో మున్సిపల్ కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వద్ద నిరసన కొనసాగించారు. పలువురు మాట్లాడుతూ.. ప్రభుత్వం మొండివైఖరిని అవలంభించడం సరి కాదన్నారు. వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధానకార్యదర్శి వెంకటేష్, నాయకులు లక్ష్మినారాయణ, బాబావలి, గంగాధర్, కార్మిక నాయకులు పాల్గొన్నారు.

రైతుకష్టం వెలకట్టలేనిది..



విద్యార్థులకు పంటల సాగు గురించి వివరిస్తున్న దృశ్యం

కొత్తచెరువు, జనవరి 7: నష్టమొచ్చిన, కష్టమొచ్చిన వ్యవసాయాన్నే ఆధారంగా చేసుకుని జీవించే రైత కష్టం వెలకట్టలేనిదని మండలకేంద్రంలోని శ్రీచైతన్య పాఠశాల ప్రిన్సిపాల్ నవీన్‌కుమార్‌రెడ్డి, డీఎన్ హనుమంతు పేర్కొన్నారు. జైకిసాన్ జైభారత్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం పాఠశాల విద్యార్థులకు పంటలు సాగుచేసే విధానంపై క్షేత్రస్థాయిలోఅవగాహన కల్పించారు. ఈ క్రమంలో సమీపంలోని పంట పొలాల వద్దకు తీసుకెళ్లి వారికి పంటల సాగు, రైతు శ్రమ గురించి వివరించారు. వరి వేరుశనగ పంటల సాగు గురించి క్షుణ్ణంగా తెలియజేశారు. విద్యార్థులు రైతుల వేషధారణలతో అలరించారు. కార్యక్రమంలో పాఠశాల ఏఓ కేశవరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో రాష్ట్రం నాశనం: కాంగ్రెస్

కొత్తచెరువు, జనవరి 7: వైసీపీ పాలనలో రాష్ట్రం నాశనమైందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర లీగల్‌సెల్ అడ్వైజర్ వీరనారాయణ విమర్శించారు. మండలకేంద్రంలోని పార్టీ మండల కన్వీనర్ బెల్లం నజీర్‌గాంధీ స్వగృహంలో ఆదివారం ఆయన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. వైఎస్‌రాజశేఖర రెడ్డి తనయుడు అని ప్రజలు జగన్‌కు ఓట్లు వేసి గెలిపించారని, ఆయన రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారని అన్నారు. నాలుగున్నరేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి మచ్చుకైనా కనిపించలేదని విమర్శించారు. ఉన్న పరిశ్రమలు, వచ్చిన పరిశ్రమలు పక్క రాష్ట్రాలకు పారిపోయే విధంగా చేశారన్నారు. ఇక జగన్ పని అయిపోయిందన్నారు. వచ్చే ఎన్నికలలో ఆయనకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. 2024 ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి ఎవరైతే కష్టకాలంలో అండగా ఉన్నారో వారికే తగిన ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. హిందూపురం పార్లమెంట్, పుట్టపర్తి అసెంబ్లీస్థానాలకు అవకాశం కల్పిస్తే తాము కూడా పోటీ చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఓడీసీ, పుట్టపర్తి కన్వీనర్‌లు రామాంజి, లక్ష్మీనారాయణతో పాటు నాయకులు షామీర్, శివారెడ్డి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మసీదు ప్రారంభోత్సవంలో కందికుంట


మసీదులో ప్రత్యేక ప్రార్థన చేస్తున్న కందికుంట వెంకట ప్రసాద్

కదిరి, జనవరి 7: తలుపుల మండలం ఓబుళరెడ్డిపల్లిలో నూతనంగా నిర్మించిన మసీదు ప్రారంభోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మత పెద్దల ఆహ్వానం మేరకు మసీదులో ఆయన దువా చేశారు. కార్యక్రమంలో నాయకులు బంగారు కృష్ణమూర్తి, ముబారక్, మేడా శంకర్, రాజారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ


ప్రతిభ చూపిన విద్యార్థులకు మొమెంటో అందజేస్తున్న దృశ్యం

ఓబుళదేవరచెరువు, జనవరి 7: హిందూపురంలోని దీప్తి పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జిల్లాస్థాయి చెకుముకి టాలెంట్ టెస్టులో మండల విద్యార్థులు ప్రతిభ చూపారు. మండలకేంద్రంలోని రైయిన్‌బో ఇంగ్లిషమీడియం పాఠశాల విద్యార్థులు మేఘానాథ్‌రెడ్డి, లయశ్రీ, యశ్వంత్‌నాయుడు ప్రతిభ కనబరచి జిల్లా స్థాయిలో ప్రథమస్థానం సాధించారు. ఈసందర్భంగా విద్యార్థులకు ప్రశంసాపత్రాలతోపాటు మెడల్స్‌ను నిర్వాహకులు అందించారు.

కర్ణాటక నాగేపల్లిలో భవిష్యత్తుకు గ్యారెంటీ


కర్ణాటక నాగేపల్లిలో కరపత్రాలు పంచుతున్న టీడీపీ నాయకులు


కదిరిలోని 20వ వార్డులో..

పుట్టపర్తి, జనవరి 7: మున్సిపాలి పరిధిలోని కర్ణాటక నాగేపల్లిలో ఆదివారం టీడీపీ శ్రేణులు బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య ముఖ్యఅతిథిగా హాజరై వారితో పాటు ఇంటింటా తిరిగి ప్రజలకు కరపత్రాలు పంచుతూ మినీమేనిఫెస్టో పథకాల గురించి వివరించారు. అనంతరం మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ పాలన సైకో పాలనను తలపిస్తోందన్నారు. ఈప్రభుత్వం ఇక మనకొద్దన్నారు. ప్రజా సంక్షేమ కోసం నిరంతరం పాటుపడే టీడీపీ ప్రభుత్వం రావాలని కోరారు. ఇందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు శ్రీరాములు, రాజప్ప కార్యకర్తలు పాల్గొన్నారు.

కదిరి: పట్టణంలోని 20వ వార్డులో టీడీపీ నాయకులు, కార్యకర్తలు బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు కరపత్రాలు పంచుతూ వివరించారు. కార్యక్రమంలో మాజీకౌన్సిలర్ సాలకి హనుమంతురావు, తెలుగుయువత నాయకులు, కార్యకర్తలు తదతరులు పాల్గొన్నారు.

గొడవలకు దూరంగా ఉండాలి

బత్తలపల్లి, జనవరి 7: గ్రామాలలో ప్రజలు గొడవలకు దూరంగా ఉండి ప్రశాంతతను నెలకొల్పాలని ఎస్ఐ శ్రీనివాసులు సూచించారు. మండలంలోని అప్రాచెరువు, గంటాపురం గ్రామాల్లో ఆదివారం ఆయన సిబ్బందితో కలిసి కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఫ్యాక్షన్ లీడర్ల ఇళ్లు, మద్యం, గుట్కా అమ్మేవారి ఇళ్లల్లో తనిఖీ చేశారు. అనంతరం ఎస్ఐ ప్రజలతో మాట్లాడుతూ ఎన్నికలు త్వరలోనే జరగనున్నాయన్నారు. ప్రజలు గొడవలకు దూరంగా ఉండి ప్రశాంత జీవనం గడపాలన్నారు. ఎవరైనా శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో ఎవరైనా గొడవలు చేసినా, పేకాట ఆడినా, మద్యం,గుట్కా అమ్మినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

ధర్మవరం, జనవరి 7: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాల ఆవరణలో ఆదివారం యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కడప పుష్పగిరి కంటి ఆస్పత్రి వైద్యులు ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో వైద్యులు పలువురికి కంటి పరీక్షలు చేసి 50 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపికచేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు శీలానాగేంద్ర, కార్యదర్శి జయరాం, సభ్యులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ

కదిరిఅర్బన్, జనవరి 7: కదిరి పట్టణంతో పాటు కాళసముద్రంలోని గురుకుల పాఠశాలల్లో హెడ్ బాల్ క్రీడాకారులకు స్థానిక బెటర్‌లైఫ్ ఫార్మసీ వారు ఆదివారం దుస్తులు పంపిణీ చేశారు. సుమారు 40మందికి దుస్తులు అందజేశారు. పంపిణీలో కదిరి పట్టణ హెడ్ బాల్ సంఘం సెక్రటరీ మహేష్, గురుకుల పాఠశాల పీడీ కిషోర్‌యాదవ్ ఉన్నారు.

లారీ బోల్తా- ఇద్దరికి గాయాలు

తనకల్లు, జనవరి 7: మండలంలోని మండ్లిపల్లి వద్ద జాతీయ రహదారిపై లారీ బోల్తా పడింది. ప్రమాదంలో డ్రైవర్‌కు, క్లీనర్‌కు గాయాలయ్యాయి. గుజరాత్ నుంచి చిత్తూరు జిల్లాలోని పుంగనూరుకు గోధుమపిండి లోడుతో వెళ్తున్న లారీ ఆదివారం తెల్లవారుజామున అదుపు తప్పి బోల్తాపడింది.

'వైసీపీపై ప్రజల్లో అసంతృప్తి'

పుట్టపర్తి, జనవరి 7: వైసీపీ పాలనపై రోజురోజుకు ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి మారుతిరెడ్డి తెలిపారు. పట్టణంలోని సాయిఆరామంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగన్ ప్రభుత్వం రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదన్నారు. పరిశ్రమలు లేవు, యువతకు ఉపాధి అవకాశాలు లేవని తెలిపారు. గడచిన ఐదేళ్లలో చెప్పుకోవడానికి కూడా ఒక్క పని చేపట్టలేదన్నారు. వైసీపీ ప్రభుత్వ తీరుపై ప్రజలు తీవ్ర అసంతృప్తిగా ఉన్నారన్నారు. వచ్చే ఎన్నికలు వైసీపీకి చివరి ఎన్నికలు కానున్నాయని ఆయన పేర్కొన్నారు.

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు గొట్లూరు క్రీడాకారుడు


క్రీడాకారుడు పవన్‌కుమార్

ధర్మవరంరూరల్, జనవరి7: మండలంలోని గొట్లూరు గ్రామానికి చెందిన క్రీడాకారుడు పవన్ కుమార్ అండర్- 17 జాతీయ స్థాయి కబడ్డీపోటీలకు ఎంపికైనట్లు ఆర్డీటీ ఏటీఎల్ శ్రీనివాసులు, కబడ్డీ కోచ్ పృథ్వీ ఆదివారం తెలిపారు. వారు మాట్లాడుతూ ఆర్డీటీ క్రీడామైదానంలో శిక్షణ తీసుకున్న పవన్ జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికయ్యారన్నారు. ఈనెల 7నుంచి 11వ తేదీ వరకు తెలంగాణలో జరిగే జాతీయస్థాయి పోటీలలో ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున పాల్గొంటారని తెలిపారు. పవన్‌ను ఆర్డీటీ సిబ్బంది, కోచ్, గ్రామస్థులు అభినందించారు.

టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా సుబ్రహ్మణ్యం

పుట్టపర్తి, జనవరి7(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా ముదిగుబ్బ మండలం ఈదులపల్లికి చెందిన సుబ్రహ్మణ్యం నియమితులయ్యారు. ఈమేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజారపు అచ్చెన్నాయుడు ఆదివారం నియమక ఉత్తర్వులు జారీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

చిలమత్తూరు, జనవరి 7: బాగేపల్లి నుంచి కొడికొండ చెకపోస్ట్ ద్విచక్రవాహనంలో వస్తున్న వ్యక్తిని వెనుకనుంచి అతి వేగంగా వచ్చిన లారీ ఢీ కొట్టడంతో మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మొరంపల్లికి చెందిన శ్రీనివాసులు(40) అనే వ్యక్తి కూరగాయల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఆదివారం బాగేపల్లి మార్కెట్‌కి వెళ్లి గ్రామానికి ద్విచక్రవాహనంలో తిరిగి వస్తుండగా రాష్ట్ర సరిహద్దులోకి రాగానే వేగంగా వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో శ్రీనివాసులు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గుర్తించి చికిత్స కోసం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడికి భార్య దీప, కుమారుడు పునీత్, కుమార్తె పల్లవి ఉన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన విషయంపై ఆరా తీశారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఫైలేరియాపై సర్వే

కదిరిఅర్బన్, జనవరి 7: మున్సిపల్ పరిధిలోని కుటాగుళ్లలో శనివారం రాత్రి ఫైలేరియా(బోదకాలు)పై సర్వే నిర్వహించినట్లు కదిరి సబ్‌యూనిట్ అధికారి దేవలానాయక్ ఆదివారం తెలిపారు. గ్రామంలోని ఇంటింటికీ వైద్యసిబ్బంది తిరిగి రక్తనమూనాలు సేకరించారన్నారు. అలాగే ప్రజలకు ఫైలేరియాపై అవగాహన కల్పించారన్నారు. ఈ వ్యాధి హెల్‌మెంట్ వర్గానికి చెందిన సన్నని పరాన్నజీవి వలన వస్తుందన్నారు. ఇది ప్రాణాంతకం కాకపోయినప్పటికీ.. అనేక దుష్పరిణామాలు కల్పిస్తుందన్నారు. ప్రతిఒక్కరూ తరచూ రాత్రి సమయంలో రక్త పరీక్ష చేయించుకుని, ఈ వ్యాధి సోకిందో లేదో నిర్ధారించుకోవాలన్నారు. అలాగే వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌లు శశిధర్, బాషా, ల్యాబ్ టెక్నీషియన్ కిషోర్, ఏఎన్ఎంలు, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.


కుటాగుళ్లలో రక్తనమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

సెలవుల్లో తరగతులు నిర్వహించే పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

హిందూపురం అర్బన్, జనవరి 7: సంక్రాంతి సెలవుల్లో విద్యార్థులను వేధిస్తూ తరగతులు నిర్వహించే విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక బీసీ కళాశాల వసతి గృహంలో ఆదివారం ఎస్ఎఫ్ఐ నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ తెలుగు వారికి మొదటి పండుగని, పండుగ రోజుల్లో కూడా కొన్ని కార్పొరేట్ విద్యాసంస్థలు తరగతులను నిర్వహించాలని చూస్తున్నాయన్నారు. తరగతులు నిర్వహించే సంస్థలపై విద్యాశాఖ కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. అనంతరం ఎస్ఎఫ్ఐ పత్రికలు ప్రదర్శించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి, నాయకులు చంద్రశేఖర్, హర్షకుమార్, నిహాల్, భరత్, అభి, వినోద్, గురు, బాబాఫక్రుద్దీన్, హేమంత్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న పారిశుధ్య కార్మికుల సమ్మె



నినాదాలు చేస్తున్న పారిశుధ్య కార్మికులు

పెనుకొండ, జనవరి 7: సమస్యల పరిష్కారం కోరుతూ పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారం 13వ రోజుకు చేరింది. స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట కార్మికులు బైఠాయించి నిరసన తెలిపారు. సమస్యలు పరిష్కరించేవరకు సమ్మెను కొనసాగిస్తామని హెచ్చరించారు. సీఐటీయూ నాయకులు రమేష్, బాబావలి, కార్మిక సంఘం నాయకులు చిన్నవెంకటేశ్, రిక్షా నరసింహులు, ముత్యాలు, నరసింహప్ప, తిప్పన్న, లక్ష్మీదేవి, వెంకటేశ్ పాల్గొన్నారు.

శ్రీరాముని అక్షింతల పంపిణీ



ప్రజలకు శ్రీరాముని అక్షింతలు అందజేస్తున్న దృశ్యం

హిందూపురం అర్బన్, జనవరి 7: ఐదు దశాబ్దాల భారతీయుల ఆకాంక్ష అయిన అయోధ్య భవ్య రామమందిరం ప్రారంభమవుతున్న వేళ యావత్ భారతావని వేయి కళ్లతో ఎదురు చూస్తోందని పలువురు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక దశరథరామయ్య కాలనీ, నానెప్పనగర్ ప్రాంతాల్లో శ్రీరాముడి చిత్రపటం, అక్షింతలు ఇళ్లలో అందించారు. డీఆర్ కాలనీ ఆంజనేయస్వామి, నానెప్పనగర్ గాయత్రీ మందింలో ప్రత్యేక పూజలు చేసి అక్షింతలు అందించారు. 22వ తేదీన ప్రతి హిందువూ తప్పకుండా దీపాలు వెలిగించి పూజలు చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్థసారథి, నవీన్, నాగరాజు, నగేష్‌బాబు, వెంకటరామిరెడ్డి, లక్ష్మీనారాయణ, తారకరాముడు, సుబ్రహ్మణ్యం, శంకర్, శేషు, వెంకటేశులు, శ్రీధర్, నరసింహులు చంద్రశేఖర్ పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

యోగి వేమన జయంత్యుత్సవాలను జయప్రదం చేయండి

పెనుకొండ టౌన్, జనవరి 7: యోగివేమన జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఏపీ రెడ్డి సంక్షేమ సేవా సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం ఎన్టీఆర్ సర్కిల్ వద్ద పోస్టర్లను విడుదల చేశారు. నిర్వాహకులు జయశంకర్‌రెడ్డి, సుగుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ 19వ తేదీన ఉత్సవాలు నిర్వహిస్తున్నామని, అలాగే పోస్టాఫీసు ఎదురుగా వేమన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఉంటుందన్నారు. పట్టణంలో ర్యాలీ, ఊరేగింపు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ప్రతి ఒక్కరూ పాల్గొని జయంతిని విజయవంతం చేయాలన్నారు. మారుతిరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, కియా మారుతిరెడ్డి, నాగిరెడ్డి, చరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



శ్రీనివాసులు మృతదేహం

చిలమత్తూరు, జనవరి 7: బాగేపల్లి నుంచి కొడికొండ చెక్‌పోస్ట్ ద్విచక్రవాహనంలో వస్తున్న వ్యక్తిని వెనుకనుంచి అతి వేగంగా వచ్చిన లారీ ఢీ కొట్టడంతో మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మొరంపల్లికి చెందిన శ్రీనివాసులు(40) అనే వ్యక్తి కూరగాయల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. ఆదివారం బాగేపల్లి మార్కెట్‌కి వెళ్లి గ్రామానికి ద్విచక్రవాహనంలో తిరిగి వస్తుండగా రాష్ట్ర సరిహద్దులోకి రాగానే వేగంగా వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో శ్రీనివాసులు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గుర్తించి చికిత్స కోసం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడికి భార్య దీప, కుమారుడు పునీత్, కుమార్తె పల్లవి ఉన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన విషయంపై ఆరా తీశారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

జూదరుల అరెస్ట్

లేపాక్షి, జనవరి 7: కొండూరు గ్రామ పొలిమేరలో జూదమాడుతున్నారన్న సమాచారంతో ఎస్ఐ గోపీ తన సిబ్బందితో కలిసి ఆదివారం దాడులు నిర్వహించారు. దాడుల్లో ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.5,250 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులపై కేసు నమోదుచేసి రిమాండుకు తరలిస్తామన్నారు.

ద్విచక్రవాహనాల ఢీ: ఇద్దరికి గాయాలు

మడకశిర రూరల్ జనవరి 7: మండలంలోని గౌడనహళ్ళి గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. స్థానికులు అందించిన సమాచారం మేరకు రాజు అనే యువకుడు ద్విచక్రవాహనంపై గౌడనహళ్లి గ్రామం వైపు వస్తుండగా, కర్ణాటక రాష్ట్రం వెంకటాపురం నుంచి గణేష్ అనే యువకుడు మడకశిరకు వస్తుండా గౌడనహళ్లి గ్రామ వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. స్థానికుల సహాయంతో మడకశిర ఆస్పత్రికి వారిని తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హిందూపురం ఆస్పత్రికి తరలించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం, కారు

గోరంట్ల, జనవరి 7: మండలంలోని జాతీయ రహదారిపై పాలసముద్రం కూడలి వద్ద కర్ణాటక నుంచి కారులో తరలిస్తున్న మద్యాన్ని ఆదివారం పట్టుకున్నట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. తెల్లవారుజామున జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ చేస్తుండగా, ఓ కారులో తెల్లటి సంచుల్లో, 25 బాక్స్‌ల్లో కర్ణాటక మద్యాన్ని తరలిస్తుండగా గుర్తించామన్నారు. కారుతోపాటు 2,400 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. కర్నూలు జిల్లాలోని తుగ్గలి మండలం షబాస్‌పురం గ్రామానికి చెందిన తలారి రంగస్వామిని అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపినట్లు ఆయన తెలిపారు.

రాష్ట్రం బాగుపడాలంటే చంద్రబాబు సీఎం కావాలి

● టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి



టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న గుండుమల

మడకశిరటౌన్, జనవరి 7: క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న నవ్యాంధ్రప్రదేశ్‌ను గట్టెక్కించాలంటే ఏకైక నాయకుడును ముఖ్యమంత్రిగా చేసుకోవాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి అన్నారు. వైసీపీని వీడి టీడీపీలోకి చేరిన పలువురు నాయకులను ఆదివారం సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్ని రంగాల్లో సర్వనాశనం చేశాడన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు పూర్తిగా కుంటుపడ్డాయని, చెప్పుకోదగ్గ ఒక్క అభివృద్ధి కార్యక్రమం చేపట్టలేక పోయాడన్నారు. వైసీపీ నాయకులే చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడితేనే రాష్ట్రానికి భవిష్యత్తు అని స్వచ్ఛందంగా పార్టీలోకి చేరుతున్నారన్నారు. 2024 ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేయాలన్న సంకల్పంతో మనమందరం సమష్టిగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. వైసీపీ నుంచి గుర్రపుకొండ తండాకు చెందిన నాయకులు టీడీపీలోకి చేరారు. లోకేష్, సుబ్బానాయక్, లక్ష్మీనరసప్పతోపాటు 15 కుటుంబాలు చేరాయి. తిప్పేస్వామి పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, వాణిజ్య విభాగం అధ్యక్షుడు కట్టాకిషోర్, యూనిట్ ఇన్‌చార్జి నాగరాజు, రవికుమార్, సోము, నాగా, తిప్పేనాయక్ పాల్గొన్నారు.

హెల్త్ సెక్రెటరీలను గ్రేడ్-2 ఉద్యోగులుగా గుర్తించాలి



మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి పరిమళ

హిందూపురం అర్బన్, జనవరి 7: సచివాలయ హెల్త్ సెక్రెటరీలను గ్రేడ్-2 ఉద్యోగులుగా గుర్తించాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పరిమళ డిమాండ్ చేశారు. స్థానిక మునిసిపల్ జేఏసీ కార్యాలయంలో ఆదివారం సచివాలయ హెల్త్ సెక్రెటరీల సంఘం, సభ్యుల సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ వైద్య ఆరోగ్యశాఖ, సచివాలయం రెండు శాఖలు మాపై అజమాయిషీ చెలాయిస్తున్నాయని మండిపడ్డారు. అలా కాకుండా ఒక్క శాఖ మాత్రమే అజమాయిషీ చేయలన్నారు. 42 యాప్‌లు ఉన్నాయని వాటితో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఆ యాప్‌లను కుదించాలని డిమాండ్ చేశారు. హెల్త్ సెక్రెటరీలకు ప్రత్యేక గుర్తింపు కోసం ఐడీ కార్డులు, యూనిఫాం అందించాలన్నారు. గ్రేడ్ 3 నుంచి గ్రేడ్ 2 ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షురాలు రామాంజినమ్మ, ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వినోద్‌కుమార్, అధ్యక్షురాలు అంజినమ్మ, కార్యదర్శి మాధవి, గౌసియా, సరిత, యశోదరాణి, ఏఐటీయూసీ తాలుకా సహాయ కార్యదర్శి ఇస్మాయిల్, బాలస్వామి పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్యశాల ప్రారంభం

పెనుకొండ, జనవరి 7: పట్టణంలోని షిర్డీసాయి మందిరం గ్లోబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు డా.సాయి కాళేశ్వర్ 51వ జయంతిని పురస్కరించుకుని సోమవారం ఆశ్రమ ప్రాంగణంలో నవ్యశ్రీ ఉచిత కంటి వైద్యశాల ప్రారంభిస్తున్నట్లు ట్రస్ట్ సభ్యులు విజయభాస్కర్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సోమవారం ఉదయం 10గంటలకు వైద్యశాలను ప్రారంభిస్తామన్నారు. ఈ వైద్యశాల ద్వారా ప్రతిరోజూ కంటి రోగులకు ఉచిత పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఆపరేషన్లు, మందులు, కంటి అద్దాలు అందించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని అవసరమైనవారు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సంక్రాంతి ముగ్గుల పోటీలు

రొద్దం, జనవరి 7: రొద్దంలో టింబక్టివ్ కలెక్టివ్ సంస్థ ఆధ్వర్యంలో చిన్నారులకు సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఆదివారం సంస్థ కార్యాలయంలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సీఈఓ లావణ్య బహుమతులు అందించారు.

బైబిల్ మిషన్ మహోత్సవాలకు తరలిరండి



పోస్టర్లు విడుదల చేస్తున్న పాస్టర్ సుధాకర్ తదితరులు

పెనుకొండ, జనవరి 7: గుంటూరులో 26, 27, 28, 29వ తేదీల్లో నిర్వహించే బైబిల్ మిషన్ మహోత్సవాలకు క్రైస్తవులు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పాస్టర్ సుధాకర్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక బైబిల్ మిషన్ చర్చిలో మహోత్సవాల పోస్టర్లను విడుదల చేశారు.

పోలీసుల హత్యాకాండలో మాజీ నక్సలైట్ల అరెస్టు



గొల్ల నాగరాజు, బోయ రామ్మోహన్, బోయ ఓబులేసు, బోయ అంజి, బోయ పద్మ

● 19 ఏళ్ల తరువాత కేసు పునర్విచారణ

పావగడ, జనవరి 7: పావగడ సరిహద్దు ప్రాంతమైన వెంకటమ్మనహళ్లి గ్రామంలో 2005 ఫిబ్రవరి 10వ తేదీన ఆరుగురు పోలీసులు, ఒక పౌరుడిని నక్సలైట్లు దారుణంగా కాల్చి చంపిన ఘటన ఇరు రాష్ట్రాల్లోనూ సంచలనం కలిగించిన విషయం తెలిసిందే. ఈఘటనకు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన గంతమర్రి గొల్ల నాగరాజు, తల్లిమడుగు బోయ రామ్మోహన్, తల్లిమడుగు బోయ ఓబులేసు, కేఎన్ పల్లి బోయ అంజి, కోనాపురం బోయ పద్మలతో కలిపి ఐదుగురు మాజీ నక్సలైట్‌లను పావగడ పోలీసులు ఆదివారం తెల్లవారుజామున అరెస్టు చేసి తీసుకొచ్చినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

గద్దర్, వరవరరావు కూడా ఈకేసులో ముద్దాయిలే...

వెంకటమ్మనహళ్లి పోలీసు హత్యాకాండలో విరసం నేత వరవరరావు, ప్రజా గాయకుడు గద్దర్ కూడా ఈకేసులో 12, 13 ముద్దాయిలుగా అప్పట్లో ఎఫ్ఐఆర్‌లో నమోదు చేసినందున 2019లో పావగడ కోర్టుకు గద్దర్, వరవరరావు హాజరయ్యారు.

ఘటన జరిగిన 19 సంవత్సరాల తరువాత అరెస్టు

సంఘటన 19 సంవత్సరాలు పూర్తవుతుండగా ఈకేసులో 45 మందికి పైగా మావోయిస్టులు, సానుభూతి పరులపై కేసు నమోదు చేసి అరెస్టు చేయగా కొంత మంది జీవతఖైదు శిక్ష అనుభవించి కూడా కర్ణాటక వాసులు నాలుగైదు సంవత్సరాల క్రితం జైలు నుండి విడుదలై వచ్చారు. అయితే అరెస్టయిన వీరిని కూడా అప్పట్లో లొంగిపొమ్మని పోలీసులు హెచ్చరించినప్పటికీ వీరు పట్టించుకోలేదని పోలీసులు తెలిపారు.

కుటుంబ సభ్యుల్లో ఆందోళన

వెంకటమ్మనహళ్లి హత్యాకాండ వెనక 2003లోనే కొందరు నక్సలైట్లు లొంగిపోయి జనస్రవంతిలో కలిసిపోయి ప్రభుత్వం నుంచి పునరావాసం పొందినప్పటికీ, ప్రస్తుతం పోలీసులు అరెస్టు చేయడం ఆందోళన, అనుమానం కలిగిస్తోందని కుటుంబ సభ్యులు తెలిపారు. అలాగే పద్మ అనే మహిళకు పోలీస్‌స్టేషన్‌లోనే మూడుసార్లు మూర్ఛరోగం రావడంతో ఆమెను కోర్టులో హాజరు పరుస్తారా... ఆస్పత్రికి చేరుస్తారా అనేది తెలియాల్సి ఉంది. వీరిని మధుగిరి జైలుకు తరలిస్తామని పోలీసులు తెలిపారు.



స్టేషన్ వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

బీసీలకు అండ టీడీపీ



మాట్లాడుతున్న పాండురంగప్ప

రొళ్ల, జనవరి 7: బీసీలకు అండ తెలుగుదేశం పార్టీ అని వక్కలిగ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ వీఎం పాండురంగప్ప అన్నారు. మండలంలోని బండ్రేపల్లి గ్రామంలో ఆదివారం బీసీల భరోసా బాట కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టీడీపీ అంటే బీసీల పార్టీఅని, బీసీలు అంటే తెలుగుదేశం పార్టీ అనే నినాదంతో రాష్ట్ర వ్యాప్తంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి గడపకు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తామన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో బీసీలకు ఒరిగింది ఏమీలేదని అన్నారు. వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గంలో టీడీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, ముఖ్యమంత్రిగా చంద్రబాబును చేసుకోవాలని అన్నారు. తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి రామచంద్రప్ప, నర్సేగౌడ్, తిమ్మప్ప, రమేష్, కెంపన్న, జయలక్ష్మమ్మ, తిమ్మక్క, చంద్రప్ప, రామప్ప పాల్గొన్నారు.

అనారోగ్య బాధితులకు బీకే పరామర్శ

రొద్దం, జనవరి 7: ఊటకూరు మాజీ సర్పంచ్ లలితమ్మ తండ్రి చౌడప్ప, ఆనందపాళ్యం గ్రామానికి చెందిన లక్ష్మీదేవమ్మ అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా హిందూపురం పార్లమెంట్ అధ్యక్షుడు బీకే పార్థసారథి పరామర్శించారు. ఆదివారం అనంతపురంలోని సవేరా ఆసుపత్రిలో ఇద్దరూ చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఆయన వారిని పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

'సజ్జలా.. నోరు అదుపులో పెట్టుకో'



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

గోరంట్ల, జనవరి 7: మంత్రి సజ్జల రామకృష్ణారెడ్డి నోరు అదుపులో పెట్టుకోవాలని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్‌పై సజ్జల అనుచిత వాఖ్యలు చేయడంపై పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి నరసింహులు, జిల్లా ఉపాధ్యక్షుడు రాజారెడ్డి, మండల కన్వీనర్ బోయ లక్ష్మీనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మరణం వెనుక కాంగ్రెస్ పార్టీ హస్తముందని ఆరోపించడం దుర్మార్గమన్నారు. ఎన్నికలు సమీపిస్తుండడంతో వైఎస్ఆర్ మరణాన్ని తెరపైకి తెచ్చి రాజకీయ లబ్ధిపొందాలని వైసీపీ ప్రయత్నిస్తోందన్నారు. షర్మిలా కాంగ్రెస్‌లో చేరడాన్ని జీర్ణించుకోలేక శవరాజకీయం చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ పార్టీకి బేషరతుగా సజ్జల క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు.

ఘనంగా సావిత్రీబాయి పూలే జయంతి

పావగడ, జనవరి 7: దేశ మొదటి ఉపాధ్యాయురాలు సావిత్రీబాయి పూలే జయంతిని సంవిధాన బలగం ఆధ్వర్యంలో ఆదివారం ఆర్ఎంసీ మార్కెట్‌యార్డులో ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి అనంతరం విద్యార్థులు, మహిళలతో జ్యోతి వెలిగించి మాట్లాడారు. అణగారిన జీవితాల్లో అక్షరమే దారిదీపంగా పేదల అభ్యున్నతికి ఎంతో పాటుపడ్డారని, ఆమె ఆశయ సాధన, అడుగుజాడల్లో నడవాల్సిన అవసరం ఉందని కర్ణాటక బౌద్ధ సమాజసంఘం అధ్యక్షుడు డాక్టర్ సుబ్బరాజు అన్నారు. డీజేఎస్ నాయుడు, నారాయణప్ప అభిప్రాయపడ్డారు. దళిత నాయకులు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి కబడ్డీ పోటీలకు గొట్లూరు క్రీడాకారుడు

ధర్మవరంరూరల్, జనవరి7: మండలంలోని గొట్లూరు గ్రామానికి చెందిన క్రీడాకారుడు పవన్‌కుమార్ అండర్-17 జాతీయస్థాయి కబడ్డీపోటీలకు ఎంపికైనట్లు ఆర్డీటీ ఏటీఎల్ శ్రీనివాసులు, కబడ్డీ కోచ్ పృథ్వీ ఆదివారం తెలిపారు. వారు మాట్లాడుతూ ఆర్డీటీ క్రీడామైదానంలో శిక్షణ తీసుకున్న పవన్ జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికయ్యారన్నారు. ఈనెల 7నుంచి 11వ తేదీ వరకు తెలంగాణలో జరిగే జాతీయస్థాయి పోటీలలో ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున పాల్గొంటారని తెలిపారు.

మెకానిక్‌పై హత్యాయత్నం

కదిరి, జనవరి 7: మెకానిక్‌పై హత్యాయత్నం జరిగిన సంఘటన ఆదివారం రాత్రి పట్టణంలో చోటు చేసుకుంది. పట్టణ సీఐ నారాయణ రెడ్డి తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని చౌక్ బజారులో మెకానిక్‌గా పని చేస్తున్న శ్రీధర్ పై బాలు అలియాస్ బాలకృష్ణ, అతని స్నేహితుడు కలిసి పవన్‌ను కత్తితో పొడిచి హత్య చేయడానికి యత్నించారు. గతంలో వీరి మధ్య సెల్‌ఫోన్ విషయంపై గొడవ జరిగింది. దీంతో పాత కక్షలు మనసులో పెట్టుకొని బాలు తన స్నేహితుడుతో కలిసి శ్రీధర్‌ను విచక్షణా రహితంగా కత్తితో పొడిచారు. ఆ సమయంలో చుట్టుపక్కల వారు రావడంతో వారు పారిపోయారు. వెంటనే శ్రీధర్‌ను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యులు మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. శ్రీధర్ భార్య జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాలు, పవన్‌తో పాటు హత్య చేసేందుకు ప్రోత్సహించారని సీపీఐ నాయకుడు ఇషాక్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.



హిందూపురంలో జీఓ ప్రతులను దహనం చేస్తున్న అంగన్‌వాడీలు



పెనుకొండలో...



చిలమత్తూరులో...

తగ్గేదే లే అంటున్న అంగన్‌వాడీలు

● ఎస్మా ప్రతుల దహనం

ఎస్మా ప్రయోగించినా, మా ప్రాణాలే తీసినా తగ్గేదే లే అంటూ అంగన్‌వాడీలు ఆగ్రహించారు. అంగన్‌వాడీలు 27 రోజులుగా తమ న్యాయమైన డిమాండ్‌ల సాధన కోసం రోడ్డెక్కి సమ్మె చేస్తుంటే వైసీపీ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదని వారు ఆరోపించారు. ఆదివారం స్థానిక సద్భావన సర్కిల్‌లోని పాత బీపీఎల్ షోరూం వద్ద ఏర్పాటు చేసిన సమ్మె శిబిరంలో నిరసన కొనసాగించారు. అనంతరం ఎస్మా జీఓ ప్రతులను దహనం చేశారు. ఎన్ని పన్నాగాలు పన్నినా సమ్మె ఆపేది లేదని హెచ్చరించారు. అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి అక్కడ మానవహారం ఏర్పాటు చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంగన్‌వాడీల సమ్మెకు ఎమ్మెల్యే రాజకీయ కార్యదర్శి శ్రీనివాసరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి అంజినప్ప, పట్టణాధ్యక్షుడు డీఈ రమేష్‌కుమార్ మద్దతు తెలిపారు. అలాగే పెనుకొండ, లేపాక్షి, చిలమత్తూరు, రొళ్లలో అంగన్‌వాడీ ఎస్మా జీఓ ప్రతులను కాల్చివేసి తమ నిరసన వ్యక్తం చేశారు.

- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్



మడకశిరలో...

ఎస్మా ప్రయోగించడాన్ని ఖండించిన ఏఐడీఎస్ఓ

హిందూపురం అర్బన్, జనవరి 7: అంగన్‌వాడీలపై ఎస్మా చట్టం ప్రయోగించడాన్ని ఏఐడీఎస్ఓ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొంది. అంగన్‌వాడీలు 27 రోజులుగా న్యాయమైన కోర్కెల కోసం సమ్మె చేస్తుంటే వారిపై ప్రయోగించిన ఎస్మా చట్టాలని రద్దు చేయాలని రాష్ట్ర కార్యదర్శి మహేష్ డిమాండ్ చేశారు. అప్రజాస్వామిక చర్యలు చేపట్టి చిన్నపాటి ఉద్యోగులను సైతం అణిచివేయాలని చూడటం నీచబుద్ధికి నిదర్శనమని విమర్శించారు.

తెలుగు పండిట్ శివన్నకు సత్కారం



శివన్నను సత్కరిస్తున్న జొన్నవిత్తుల రామలింగేశ్వర రావు

మడకశిర రూరల్ జనవరి 7: అంతర్జాతీయ తెలుగు మహాసభలు రాజమండ్రిలో ఆదివారం నిర్వహించారు. సదస్సులో మడకశిర ఉన్నత పాఠశాలలో తెలుగు పండిట్‌గా పనిచేస్తున్న శివన్నకు తెలుగు, కన్నడ యక్షగానవారధి అనే బిరుదుతో సత్కరించారు. ప్రదర్శన, కళల విభాగంలో తెలుగు, కన్నడ యక్షగానం అనే అంశంపై ఆయన ప్రసంగించారు. రెండు భాషలలో యక్షగానం కోసం నిరంతరం ఆయన శ్రమించినట్లు తెలిపారు. ఈ సభలో దాడి వీరభద్రరావు, ప్రముఖ హాస్య పేరడీ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వర రావు చేతుమీదుగా సత్కరించి బిరుదు ఇవ్వడం తనకు ఎంతో సంతోషంగా ఉందని శివన్న తెలిపారు.